



# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, గురువారం 07-07-2022 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 248 పేజీలు : 08 వెల : 1 రూపాయి


## పెట్టుబడులకు అనువైన వాతావరణం ఏపీలో ఉంది

- మంత్రి అమర్‌నాథ్



అమరావతి (విజయభాను న్యూస్) : పెట్టుబడులకు అనువైన వాతావరణం ఆంధ్రప్రదేశ్‌లో ఉందని రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. 300 అంశాలను పరిశీలించి కేంద్రం ర్యాంకింగ్స్ ఇచ్చింది, అంతే కాక పారిశ్రామిక వేత్తల ఫీడ్ బ్యాక్ తీసుకున్నారని చెప్పారు. ఏపీ అభివృద్ధిని చూసి ఎల్లో మీడియా ఓర్వలేకపోతోందని, ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆర్భాటాలకే పరిమితమైందని, 4 లక్షల ఉద్యోగాలంటూ యువతను మోసం చేసిన ఘనత వారిదని ధ్వజమెత్తారు.

# కడప జిల్లా పర్యటనకు సీఎం జగన్..

- 7 న పులివెందుల, వేంపల్లెలో పలుకార్యక్రమాలలో పాల్గొననున్న సీఎం
- 8 న తండ్రి దివంగత వైఎస్సార్‌కు కుటుంబ సభ్యులతో కలసి ఘన నివాళి



పులివెందుల/కడప: జిల్లాలో ఈనెల 7,8 తేదీలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం షెడ్యూల్ ఖరారు చేసింది. 7వ తేదీ ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి 9.20 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ 9.30కి బయలుదేరి 10.20 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10.30కి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 10.55కు పులివెందులలోని బాకరాపురం హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 10.55కు హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 11 గంటలకు పులివెందులలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహానికి చేరుకుంటారు. 11.05 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ప్రజలు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడి వారి వినతులు స్వీకరిస్తారు. 1.05కు ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్ నుంచి బయలుదేరి 1.15కు పులివెందులలోని ఏపీకార్ల్ చేరుకుంటారు. అక్కడ 1.30వరకూ ఉండి క్షేత్రస్థాయి పర్యటన చేస్తారు. 1.30కి ఏపీకార్ల్ నుంచి బయలుదేరి 1.35కు ఏపీకార్ల్ ప్రధాన భవనానికి చేరుకుని న్యూటెక్ బయోసైన్సెస్‌కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ప్రధాన భవనంలో ఐజీ కార్ల్ మీటింగ్‌లో పాల్గొంటారు. 2.35కు ఏపీకార్ల్ నుంచి బయలుదేరి 2.45కు బాకరాపురం హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 2.50కు అక్కడి నుంచి బయలుదేరి 3.05కు వేంపల్లి హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ 3.20వరకూ స్థానిక నేతలతో మాట్లాడుతారు. 3.20కి రోడ్డు మార్గాన బయలుదేరి 3.30కి డా. వైఎస్సార్ స్మారక పార్కుకు చేరుకొని పార్కును ప్రారంభిస్తారు. 3.50కి అక్కడి నుంచి బయలుదేరి 4 గంటలకు వేంపల్లి జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌కు చేరుకుని భవనాల ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అక్కడ 4.50 వరకూ విద్యార్థినీ, విద్యార్థులతో ముచ్చటిస్తారు. 4.50కి వేంపల్లి జెడ్పీ స్కూల్ నుంచి బయలుదేరి సాయంత్రం 5 గంటలకు వేంపల్లి హెలీప్యాడ్ చేరుకుంటారు. 5.05కు హెలికాప్టర్‌లో బయలుదేరి 5.15కు

తరువాయి 2లో..

## బూస్టర్ డోసు వ్యవధి ఇక 6 నెలలే



దిల్లీ: బూస్టర్ డోసు వ్యవధిని 6 నెలలకు తగ్గించాలని నేషనల్ టెక్నికల్ అడ్వైజరీ గ్రూప్ ఆన్ ఇమ్యూనైజేషన్ (NTAGI) ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఇప్పటివరకు ఈ వ్యవధి తొమ్మిది నెలలుగా ఉంది. దీంతో రెండో డోసు తీసుకున్న 6నెలలు పూర్తైన వారికి బూస్టర్ డోసును అందించనున్నారు. దేశవ్యాప్తంగా మరోసారి కొవిడ్ ఉద్ధృతి పెరుగుతోన్న దృష్ట్యా కొవిడ్ వర్కింగ్ గ్రూప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే, కొవిడ్ పోరులో భాగంగా దేశవ్యాప్తంగా ప్రికాషనరీ డోసు పంపిణీకి కేంద్ర ప్రభుత్వం అనుమతించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వీటిని ప్రైవేటు కేంద్రాల్లోనే అందిస్తుండగా.. రెండో డోసు తీసుకున్న 9 నెలల గడువు పూర్తయిన వారికే పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బూస్టర్ డోసు వ్యవధిని తొమ్మిది నెలల నుంచి 6 నెలలకు తగ్గించాలని నిపుణుల నుంచి డిమాండ్ పెరిగింది. దీనిపై సమీక్ష జరిపిన కేంద్ర ప్రభుత్వం ఈ గడువును 6 నెలలకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది.

## సీఎం జగన్‌తో కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి బృందం భేటీ

అమరావతి: కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి బృందం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సమావేశం అయ్యింది. బుధవారం సాయంత్రం.. క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌తో కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి మనోజ్ అహూజా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన సీఈవో, సంయుక్త కార్యదర్శి రితేష్ చౌహాన్, కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.సునీల్, నోడల్ ఆఫీసర్ అజయ్‌కరన్‌లతో కూడిన బృందం భేటీ అయ్యింది. ఈ భేటీకి వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీ జి శేఖర్ బాబు హాజరు అయ్యారు. ఏపీకి సంబంధించి కీలకాంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది.



## అద్దె బస్సులకు ఆహ్వానం




**విజయవాడ** : రాష్ట్రంలో భారీగా అద్దె బస్సులను తీసుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ఈమేరకు టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 659 అద్దె బస్సులు తీసుకోవాలని నిర్ణయించినట్టు ఆర్టీసీ ఈడీ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. 9 ఏసీ స్లీపర్ బస్సులు, 47 నాన్ ఏసీ స్లీపర్, 6 ఇంద్ర, 46 సూపర్ లగ్జరీ బస్సులు, 22 అల్ట్రా డీలక్స్, 70 ఎక్స్‌ప్రెస్, 208 అల్ట్రా పల్లె వెలుగు, 203 పల్లె వెలుగు, 39 మెట్రో ఎక్స్‌ప్రెస్, 9 సిటీ ఆర్డినరీ బస్సులకు టెండర్లు ఆహ్వానించారు. జిల్లాల వారీగా పలు రకాల బస్సులు, సంఖ్య నిర్ణయించి ఆమేరకు టెండర్లు పిలిచారు. ఆసక్తి కలిగిన వారు MSTC ఈ కామర్స్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఆర్టీసీ ఈడీ తెలిపారు. ఇవాల్టి నుంచి ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు బిడ్లు దాఖలు చేయవచ్చని వెల్లడించారు. http://apsrtc.ap.gov.in వెబ్ సైట్‌లో టెండర్లకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

# 18 సం॥లు నిండిన ప్రతీ పేద మహిళను సంఘాలలో చేర్చాలి

### సెర్ప్ సంస్థ ద్వారా అందిస్తున్న పథకాలు అర్హులందరికి అందాలి

### పంచాయితీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్టాత్మకమైన నవరత్నాలలో సుమారు నాలుగు పథకాలు "సెర్ప్ సంస్థ" ద్వారానే అమలు అవుతున్నాయని పంచాయితీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖా మాత్యులు బూడి ముత్యాలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక దసపల్లా హెూటల్ లో జరిగిన డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ల వర్క్ షాప్ సమావేశంలో ఆయన ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సెర్ప్ సంస్థకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, నిరుపేదల అభ్యున్నతికి , వారి ఆర్థిక పరిపుష్టి కొరకు అహర్నిశలూ పనిచేస్తుందన్నారు. మహిళలు ఎక్కడైతే అభివృద్ధి చెందుతారో అక్కడ కుటుంబాలు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళా సాధికారతకు సుమారుగా కోటి మంది స్వయం సహాయక సంఘ మహిళలకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. మహిళల అభివృద్ధికి ఆర్థిక సహాయం చేయడమే కాకుండా, వివిధ దిగ్గజ సంస్థలతో ఒప్పందాలు చేసుకొని మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుటకు ఈ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం స్త్రీ నిధి ప్రవేశ పెట్టిన తర్వాత అక్కాచెల్లమ్మలకు మరింత ఆర్థిక మద్ధతు అందుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పేద మహిళను సంఘాలలో చేర్చి వారికి శిక్షణనిస్తూ సంఘ నిర్వహణపై అవగహన కలిగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

26 జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్ లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సిబ్బంది యొక్క పనితీరును మరియు క్షేత్ర

తరువాయి 2లో..







# దళితులకు త్రాగు నీరు అందించాలి

## - సీపీఎం డిమాండ్



మధురవాడ (విజయభాను న్యూస్) : మహా విశాఖ జోన్ 2 పరిధి కోమ్మాధి ఎస్సి కాలనీలో గత 25 సవంత్సరాలుగా కమ్మల ఇల్లు, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుని నివాసం వుంటున్న దళితులు, పేదల కు కనీసం త్రాగునీరు ఇవ్వక పోవడం అన్యాయమని సీపీఎం మధురవాడ జోన్ కార్యదర్శి డీ అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేసారు. బుధవారం కోమ్మాది ఎస్‌సి కాలనీలో, జి వి ఎం సి అంబేద్కర్ విగ్రహాలు వద్ద త్రాగునీరు,వీధి దీపాలు సమస్య పరిష్కారం చేయాలని ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ సుమారు 25 సంవత్సరాల క్రితం నుండి దళితులు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని. రోజుకులి చేసుకుని జీవిస్తున్నా వీరికి కనీసం త్రాగునీరు ఇవ్వక పోవడం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకొని త్రాగు నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత 15 రోజులుగా విది దీపాలు వెలగడం లేదని చుట్టు పక్కల చెట్లు, మొక్కలు, తుప్పలు కాలీ స్థలాలలో వుండటం,గెడ్డ కు ఆనుకొని వుండటంతో విపరీతంగా పాములు,ఇతర విష ప్రాణులు సంచరిస్తున్నాయాని తెలియ జేశారు. ఈ మేరకు జోనల్ కమిషనర్ బి.రాము కలిసి వినతి పత్రాలు అందచేశారు. వెంటనే సంబంధిత అధికారుల తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో కే వి పీ ఎస్ నాయకులు ఎస్ పైడి తల్లి, ఎస్ పోలయ్య,ఎం చిన్న,ఎస్ రాజు,జి నాగరాజు, ఎం కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జగదాంబ సెంటర్‌లో గీతం ఉచిత వైద్యశిబిరం



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) :

గీతం దంత వైద్య కళాశాల మరియు ఆస్పత్రి ఆధ్వర్యలో బుదవారం స్థానిక జగదంబ సెంటర్ 31 వార్డు డ్వాక్రా బజార్ స్వచ్ఛవాలయంలోని గీతం ఉచిత దంత వైద్య శిభిరాన్ని ప్రారంభించారు. ఈ ఉచిత దంత వైద్య శిభిరంలో దాదాపు 165 మందికి పైగా స్థానిక ప్రజలు పాల్గొని దంత పరీక్షలు చేయించుకున్నారు. గీతం దంత వైద్య కళాశాల ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ బి.సునీల్‌కుమార్, డాక్టర్ డి. వసుధ, డాక్టర్ యష్శ్వి, డాక్టర్ వై.ఓల్గా, డాక్టర్ పి. వంశిక, డాక్టర్ కె.వినీక, డాక్టర్ ఎమ్.యువరాణి తదితరులు పాల్గొన్నారు. సాధారణ వైద్య పరీక్షలతో పాటు, బిపి, సుగర్, దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ ఉచిత వైద్య శిభిరానికి కో ఆర్డినేటర్‌గా కె.ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# 18 సం॥లు నిండిన ప్రతీ పేద మహిళను సంఘాలలో చేర్చాలి

స్థాయిలో జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాల పనితీరును అంచనావేయాలన్నారు. జిల్లా సమాఖ్య సమావేశాలను క్రమం తప్పకుండ నిర్వహిస్తూ

సంబంధిత సిబ్బంది అనగా (DPMs, APMs, CCs VOA) తో ప్రభుత్వం నిర్వహించే పథకాల గూర్చి సభ్యులందరికీ పూర్తి అవగహన కల్పించి, పథకాలు అందరికి అందేలా చర్యలు తీసుకోవలసినదిగా ఆదేశించారు. సెర్ప్ సంస్థ సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించి జీవనోపాధిని అధిక మొత్తములో కల్పించడంలో ప్రభుత్వానికి రెండు విభాగాలలో Indian Gold Skoch Award వచ్చినందున సంతోషం వ్యక్తం చేసారు. ఇటువంటి వర్క్ షాప్ లు ఆరు నెలలకొకసారి వివిధ ప్రాంతాల్లో నిర్వహించి, ఈ సర్థ మరింత అభివృద్ధి మార్గంలో అడుగులు వేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు.

ఈ సందర్భంగా ఆయా రంగాలలో ఉన్న దిగ్గజ వ్యాపార సంస్థలతో (1 AMUL Dairy and Milk Product 2. Ayekart 3. CSC) ఒప్పందాలు చేసుకొని పత్రాలను అందిపుచ్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో సెర్ప్ సి.ఇ.ఓ ఎమ్.డిఇంతియాజ్ అహ్మద్, స్త్రీనిధి ఎమ్.డి నాంచారయ్య, లైవ్లీహుడ్ డైరక్టర్ విజయ కుమారి, సెర్ప్ సిబ్బంది, 26 జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్, డి.పి.ఎమ్ లు, విశాఖపట్నం జిల్లా డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.డి అనిత, అనకాపల్లి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.డైజి, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొనడం జరిగినది.

# కడప జిల్లా పర్యటనకు సీఎం జగన్..

ఇడుపులపాయ చేరుకుంటారు. 5.20కి హెలీప్యాడ్ నుంచి బయలుదేరి 5.25కు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఎస్టేట్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు.

8వ తేదీ ఉదయం 8 గంటలకు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఎస్టేట్ నుంచి బయలుదేరి 8.05కు వైఎస్సార్ ఘాట్‌కు చేరుకొని దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళులు అర్పించి ప్రార్థనల్లో పాల్గొంటారు. 8.45కు వైఎస్సార్ ఘాట్ నుంచి బయలుదేరి 8.50కు ఇడుపులపాయలోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. 8.55కు హెలీకాప్టర్‌లో బయలుదేరి 9.10కి కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. 9.20 గంటలకు కడప విమానాశ్రయం నుంచి బయలుదేరి 10.10 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి 10.20కి రోడ్డు మార్గాన బయలుదేరి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగనున్న వైఎస్సార్‌సీపీ ప్లీనరీలో పాల్గొంటారు.

**8 సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు**

ఈనెల 7, 8వ తేదీలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వి.విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్‌లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రి పర్యటనా ప్రాంతాలను వారు క్షుణ్ణంగా పరిశీలించారు.

కడప పులివెందుల బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ స్థలాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న అధికారులకు భద్రతపై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన వైఎస్సార్ మెమోరియల్ పార్కు, రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల నూతన భవనాలు, కంప్యూటర్ ల్యాబ్స్, ఆర్ఓ మినరల్ వాటర్ ప్లాంటును పరిశీలించారు. వీటిని 7వ తేదీన సీఎం వైఎస్ జగన్ ప్రారంభించనున్నారు.

కార్యక్రమంలో జేసీ సాయికాంత్‌వర్మ, అడిషనల్ ఎస్పీ మహేష్‌కుమార్, ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనివాసులు, ఎంపీపీ ఎన్.లక్ష్మీగాయత్రి, మండల ఉపాధ్యక్షుడు బాబా షరీఫ్, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, ఈఈ సిద్ధారెడ్డి, ఏపీఈడబ్ల్యుఐడీసీ డీఈ సుబ్రమణ్యకుమార్, విద్యుత్ శాఖ డీఈ శ్రీకాంత్, స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ ఎన్.చంద్రశేఖరరెడ్డి, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు

పులివెందుల: సీఎం వైఎస్ జగన్ పులివెందులలో పర్యటించనున్న దృష్ట్యా అందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్‌లు మంగళవారం పరిశీలించారు. పులివెందులలోని భాకరాపురంలోని హెలీప్యాడ్, ఆర్అండ్‌బీ అతిథి గృహం, ఏపీ కార్ల్‌ను వారు పరిశీలించారు. అధికారులకు పర్యటనా ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యలు, భద్రతకు సంబంధించి పలు సూచనలు, సలహాలను అందించారు. ఆర్అండ్‌బీ అతిథి గృహంలో తీసుకోవాల్సిన చర్యలపై, ఏపీ కార్ల్‌లో రైతులతో సమావేశం ఉన్నందున అక్కడ ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్న విషయాలపై సుదీర్ఘంగా అధికారులతో చర్చించారు.

పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ ఈఈ సిద్ధారెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి, కమిషనర్ నరసింహారెడ్డి, సీఐలు రాజు, బాలమద్దిలేటి, ఎస్‌ఐలు గోపినాథరెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

# అమ్మ ఒడి బూటకం.. ఇంగ్లీష్ మీడియం ఒక నాటకం



మదనపల్లె: చిత్తూరు జిల్లా మదనపల్లె లో 'ఎన్టీఆర్ స్ఫూర్తి-చంద్రన్న భరోసా' పేరుతో తెదేపా భారీ బహిరంగ సభ నిర్వహించింది. జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన తెదేపా శ్రేణులనుద్దేశించి చంద్రబాబు మాట్లాడారు...''మూడేళ్లుగా అరాచక పాలనపై పోరాటం చేస్తున్నాం. ఎక్కడ చూసినా సమస్యలు.. లేని సమస్యలు సృష్టించారు. ప్రశ్నించిన వారిని బెదిరించి కేసులు పెడుతున్నారు. మేం కన్నెర్ర చేస్తే వైకాపా నాయకులు బయటకు రాలేరు. పోలీసులను అడ్డం పెట్టుకుని ఏమీ సాధించలేరు. మేం తలచుకుంటే జగన్ పాదయాత్ర చేసే వారా? ఆరోజు ఊరూరా తిరిగి ముద్దులు పెట్టి... ఇప్పుడేమో పిడిగుద్దులు గుద్దుతున్నారు. పేద పిల్లలు బాగా చదువుకోవాలని కోరుకున్న పార్టీ తెదేపా. మా హయాంలో ప్రతి గ్రామంలోనూ పాఠశాలలు కట్టించాం. అమ్మ ఒడికి ఆంక్షలు పెట్టి తల్లులను మోసం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రజల పార్టీ. అమ్మ ఒడి బూటకం, ఇంగ్లిష్ మీడియం ఒక నాటకం, నాడు- నేడు అవినీతి మయం'' అని చంద్రబాబు విమర్శించారు.

**ప్రభుత్వంపై పోరాడేందుకు ఇంటికొకరు రావాలి**

''వైకాపా ప్రభుత్వం వచ్చాక అన్నింటిపై బాదుడే బాదుడు. ఆర్టీసీ ఛార్జీలు పెంచి పేదలపై తీవ్ర భారం మోపారు. మళ్లీ గ్యాస్ సిలిండర్ ధర పెంచారు. నిత్యావసరాల ధరలు పెరిగాయి. కొత్త బ్రాండ్ల పేరుతో నాసిరకం మద్యం తెస్తున్నారు. ల్యాబ్ పరీక్షలో మద్యంలో రసాయనాలు ఉన్నాయని తేలింది. జగన్ .. సొంత డిస్టిలరీలు పెట్టుకుని రేట్లు పెంచారు. నాసిరకం మద్యం తెచ్చి ప్రజల ఆరోగ్యంతో ఆటలా? మూడేళ్లలో ఐదుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. కొత్తగా రూ.5వేల కోట్ల వృత్తి పన్ను వేస్తున్నారు. ఈ ప్రభుత్వంపై పోరాడేందుకు ఇంటికొకరు ముందుకు రావాలి. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఏమైంది? నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుతున్నారు'' అని చంద్రబాబు ఆరోపించారు. మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డితో పలువురు జిల్లా నేతలు, కార్యకర్తలు భారీగా తరలి రావడంతో మదనపల్లె జనసంద్రంగా మారింది. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా పార్టీ నేతలు చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు.

# అనకాపల్లిలోని గాంధీ మార్కెట్లో సీసీ రోడ్డు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

## - ప్లాస్టిక్ నిర్మూలనకు నిరంతరం పరిశీలన - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అనకాపల్లిలోని గాంధీ మార్కెట్లో సిసి రోడ్డు నిర్మాణానికి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అనకాపల్లి జోన్ లోనే గాంధీ మార్కెట్, చేపల మార్కెట్, కన్యకా పరమేశ్వరి రోడ్డు తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గాంధీ మార్కెట్ రోడ్డు శిధిలావస్థలో ఉన్నందున ఆ ప్రాంతంలో సి సి రోడ్డు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయా మార్కెట్ల దుకాణదారులు తోనూ, రైతులతోనూ నిషేధిత ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలను వారికి వివరించారు. నిషేధిత ప్లాస్టిక్ తక్షణమే విడనాడాలని వారికి సూచించారు. మార్కెట్లో వాటర్ ప్యాకెట్లు అధికంగా కనిపిస్తున్నాయని వాటిని నిరోధించాలని శానిటరీ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. టిఫిన్ సెంటర్ లోనూ, హెూటల్స్ లోనూ చెట్నీలు, కూరల కొరకు సిల్వర్ కవర్లు వాడుతున్నారని అవి వాడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ మార్కెట్లకు గ్రామీణ ప్రాంతాల నుండి రైతులు, వినియోగదారులు వస్తారని వారికి ప్లాస్టిక్ పై పూర్తి అవగాహన ఉండదని, అందుకు దుకాణదారులు, మార్కెట్ కమిటీలు ప్లాస్టిక్ పై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజా ఆరోగ్యపు అధికారులు, కార్యదర్శులు నిరం తరం మార్కెట్లను సందర్శించి రైతులు, దుకాణాదారులు, వినియోగదారులు కానీ ప్లాస్టిక్ వాడకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ రహితమైన ఆకులు, కాగితపు, క్లాత్, స్టీలు వంటి వస్తువులు ఉపయోగిం చుకోవాలని టిఫిన్ సెంటర్లు, హెూటల్ యజమానులకు సూచించారు. ఇప్పటికే ప్లాస్టిక్ గేజ్ మిషన్లు అధికారులకు అందించడం జరిగిందని, వాటి ద్వారా ప్రతి రోజు తనిఖీలు నిర్వహించి ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్ ఉపయోగించినట్లయితే వారి నుండి అపరాధ రుసుం వసూలు చేయాలని, దుకాణదారులు, టిఫిన్ సెంటర్లు వాడుతున్న ప్లాస్టిక్ గేజ్ ఎప్పటికప్పుడు పరిశీలించి రికార్డు చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జివిఎంసి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ఎల్జి శాస్త్రి, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజనీర్ మత్స్యరాజు, ఉప కార్యనిర్వహక ఇంజనీరు, అసిస్టెంట్ ఇంజనీర్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



# 8న శ్రీకాకుళంలో జాబ్ మేళా

## జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు

**శ్రీకాకుళం :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల కొరకు ఈ నెల 8న శ్రీకాకుళం నగరంలో జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీకాకుళం మెడ్ ప్లస్ ఫార్మసీ నందు గల అప్రెంటీస్, కస్టమర్ సర్వీస్ అసోసియేట్ (సిఎస్ఎ), ఫార్మసిస్ట్ పోస్టులలో పనిచేయుటకు ఈ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన జారీచేసారు. అప్రెంటిస్ పోస్టులు 20 ఉన్నాయని, వీటికి 10వ తరగతి లేదా ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగి 18 నుండి 24ఏళ్ల లోపు వయస్సు ఉండాలన్నారు. వీరికి నెలకు రూ.9,084/-లు జీతం చెల్లించబడుతుందని తెలిపారు. సిఎస్ఎ పోస్టులు 10 ఉన్నాయని వీటికి 10వ తరగతి లేదా ఇంటర్, డిగ్రీ విద్యార్హత కలిగి 18 నుండి 32ఏళ్ల లోపు వయస్సు ఉండాలని, వీరికి నెలకు రూ.10,000/-లు జీతంతో పాటు పి.ఎఫ్ మరియు ఇ.ఎస్.ఐ వర్తించబడుతుందని చెప్పారు. అలాగే 10 ఫార్మసిస్ట్ పోస్టులకు గాను బి.ఫార్మసీ లేదా డి.ఫార్మసీ లేదా ఎం.ఫార్మసీ మరియు పిసిఐ విద్యార్హత కలిగిన వారు ఈ పోస్టులకు అర్హులని, వీరికి వయసుతో నిమిత్తం లేదని అన్నారు. వీరికి నెలకు రూ.11,000/-లు జీతంతో పాటు పి.ఎఫ్ మరియు ఇ.ఎస్.ఐ వర్తించనుందని ఆయన ఆ ప్రకటనలో స్పష్టం చేసారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత , ఉద్యోగ అనుభవ వివరాలను www.ncs.ap.gov.in వెబ్ సైట్ నందు నమోదు చేసుకొని జూలై 8న ఉదయం 10.00గం.లకు గవర్నమెంటు ఐ.టి.ఐ, హాస్పిటల్ జంక్షన్, బలగ రోడ్డు, శ్రీకాకుళంకు తమ బయోడేటా, సర్టిఫికేట్లు, ఆధార్ కార్డు మరియు రెండు పాస్ ఫొటోలతో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

# సంస్కృతి నృత్యాలుకు చేయూతను ఇవ్వండి

### శ్రీ సీతారామాంజనేయ కోలాట బృందం అర్గనైజర్ రాము



పరవాడ (విజయభాను న్యూస్) : అంతరించుకుపోతున్న సంస్కృతిక నృత్యాలుకు తోడ్పటును అందించాలనీ పి.బోనంగి ఉపసర్పంచ్ ,శ్రీ సీతారామాం జనేయ చిన్న పిల్లల కోలాట బృందం అర్గనైజింగ్ అండ్ డైరక్టర్ జి.రాము తెలిపారు.బుధవారం అయన విజయభాను ప్రతినిథితో మాటా ్లడుతూ పరవాడ మండలం పి.బోనంగి పంచాయితీ పరిధిలో శ్రీదుర్గమాంబ అమ్మవారి అశీస్సులుతో శ్రీసీతారామాంజనేయ చిన్నపిల్లలు కోలాట బృందంచే చిడతలు, కర్ర స్వాములు, భజనలు, తోలేలు, గరిడి, తప్పిడిగుళ్ళు తథితర నృత్యాలు నేర్పించబడును అని అన్నారు. గురువు గుర్రం రాజుబాబు అద్వర్యంలో అసిస్టెంట్ అర్గనైజర్స్ మరియు డైరక్టర్స్ గాజె.నాగేష్, జె.రాము ప్రాతినిద్యం వహిస్తున్నారు అన్నారు.

పరిసర ప్రాంతాల్లో జరిగే గ్రామ పండుగలుకు, మీ వివాహది శుభాకార్యములుకు వివిధ రకాల వేషాలతో కోలాటం ప్రదర్శించబడును అని అన్నారు. కావున జిల్లాలో గల ప్రజలు అందరూ మీ శుభ కార్యములుకు, పండుగలకు శ్రీ సీతా రామాంజనేయ చిన్న పిల్లల కోలాట బృందం బుకింగ్ కొరుకు 9553413839 మరియు 9553412661 మరియు 95059 96803 తథితర పోన్ నెంబర్లును సంప్రదిం చాలాని ఈ సందర్భంగా పి.బోనంగి ఉపసర్పంచ్ జి.రాము కోరారు.

### భీమిలి ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ గా శ్రీనివాసరావు



భీమునిపట్నం (విజయ భాను న్యూస్) : భీమిలి మండల ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ గా కె. శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అనకాపల్లి జిల్లా,నాతవరం మండలం హెచ్‌డిటి గా పని జేసిన ఈయన భీమిలి బదిలీపై వచ్చారు. ఇక్కడ తహశీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిం చిన ఎం సువర్ణభాయి విశాఖ మహారాణిపేటకు బదిలీపైవెళ్ళారు.

# అడ్డూరులో ప్రపంచ జూనోసిస్ డే కార్యక్రమం

### - 42 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్
### - పెంపుడు కుక్కలకు ప్రతి ఏడాది యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరి
### - పశు వైద్యాధికారి డాక్టర్ టి ప్రశాంత్ కుమార్



అడ్డూరు లో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ టి.ప్రశాంత్‌కుమార్

చోడవరం(విజయభాను న్యూస్) : మండలం లోని అడ్డూరు గ్రామం పశు వైద్యశాల ఆవరణలో బుధవారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా పెంపుడు కుక్క లకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ టి.ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో...

42 పెంపుడు కుక్క లకు ఈ వ్యాక్సినేషన్ చేశారు. అంతకు ముందు పశువైద్యాధికారి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పెంపుడు కుక్కలు ఉన్నవారు ప్రతి ఏడాది యాంటీ రేబిస్ వ్యాక్సిన్ నేషన్ తప్పనిసరిగా వేయించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలోపశు వైద్య సిబ్బంది తో పాటు, పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు.

### ఈనెల 12న చోడవరంలో

# మెగా రక్తదాన శిబిరం

చోడవరం( విజయభాను న్యూస్)- చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రిన్సిపాల్వి డాక్టర్ రామచంద్ర రావు , విశ్వనాథ్ లైప్ ఇన్స్టిట్యూట్ సౌజన్యంతో ఈ నెల 12న మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సంజీవని వాలంటరీ బ్లడ్ బ్యాంకు, ఫస్ట్ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో 12వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, దాతలు స్వచ్ఛందంగా వచ్చి విజయ వంతం చేయాలని కోరారు.

### భీమిలి మండలంలో

# రైతులు ఇకెవైసి చేయించుకోవాలి

భీమునిపట్నం (విజయభాను న్యూస్) : భీమిలి మండలంలో పీఎం కిసాన్ కి సంబంధించి రైతులు ఈనెల ఆఖరుతేదీ లోపు ఇకెటవైసి చేయించుకోవాలనీ భీమిలి మండల వ్యవసాయ అధికారి బి.శివకోమలి ఒక ప్రకటనలో తెలిపారు.రైతులు ఆధార్ నెంబర్ కు బ్యాంక్ ఎకౌంట్ కి అనుసంధానం చేయించుకున్నారనీ, అయితే వీరిలో 1499 రైతులు మాత్రమే ఇప్పటివరకు ఇకెవైసి చేయించుకోవడం జరిగిందనీ, ఇంకా 5377 మంది రైతులు ఇకెవైసి చేయించుకోలేదనీ చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మిగిలిన 5377 మంది రైతులు ఇకెవైసి చేయించుకోవాలని , లేనియెడల వీరికి పీఎంకిసాన్ 12వ ఇన్స్టాల్ మెంట్ నగదు వీరి ఖాతాలోకి జమ కాదనీ తెలిపారు.

# స్వచ్ఛభారతావని నిర్మాణంలో మేము సైతం

### - స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేసిన హెచ్ పిసిఎల్ ఉద్యోగులు




గాజువాక (విజయభాను న్యూస్): స్వచ్ఛ భారతావని నిర్మాణంలో మేముసైత భాగ మంటూ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. బుధవారం ఉదయం ఉద్యోగుల నివాస గృహాల సముదాయం యారాడ పార్క్ ఉద్యోగులు, సిబ్బందితో సంస్థ సిజిఎం ఎం. సోమసుందర్ ముఖ్య అతిథిగా హజరై స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ స్వచ్ఛత ముందుగా మన ఇంటినుంచే ప్రారంభం కావాల న్నారు. మన ఇంటిని, పనిచేసే సంస్థ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా స్వచ్ఛ నగరాన్ని, స్వచ్ఛ భారతావని నిర్మాణంలో భాగం కావడం సాధ్యపడు తుందన్నారు. బాధ్యతాయుత పౌరులుగా నిలుస్తూ స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తద్వారా ఆరోగ్య భారతావని నిర్మాణం సాధ్యపడుతుందన్నారు. ఉద్యోగుల అంకితభావం, చొరవను ఆయన అభినందించారు. స్వపక్షోత్సవాలలో భాగంగా 'క్లీన్ ఇండియా-గ్రీన్ ఇండియా' వెబినార్లో వివిధ పాఠశాలలకు చెందిన 450 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ప్రముఖ పర్యావరణ వేత్త జె.రత్నం విద్యార్థులకు పర్యావరణ సంబంధ అంశాలపై అవగాహన కల్పించారు. మన జీవనంలో చిన్నపాటి మార్పులు చేసుకుంటూ పర్యావరణ పరిరక్షణకు ఏ విధంగా దోహదకారిగా నిలవవచ్చునో వివరించారు. కార్యక్రమంలో హెచ్ పిసిఎల్ ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల విలీనంపై ప్రభుత్వం మొండి వైఖరి మార్చుకోవాలి



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : పాఠశాలల విలీనంపై ప్రభుత్వం మొండి వైఖరి మార్చుకోవాలని పూడిమడక టీడీపి సీనియర్ నాయకులు మేరుగు బాపు నాయుడు డిమాండ్ చేశారు . బుధవారం ఎలమంచిలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మండలంలో పూడిమడక శివారు కొండపాలెం ప్రాథమిక పాఠశాల వద్ద పాఠశాలల విలీనంపై టిడిపి నాయకులుతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీనాన్ని విద్యార్థి తల్లిదండ్రులు వ్యతిరేకి స్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. పిల్లలకు ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారన్నారు . ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాల విలీనాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా టిఎన్ టియుసి ప్రధాన కార్యదర్శి పొన్నమల్ల కొండబాబు, టిడిపి నాయకులు మేరుగు మహేష్, మైలపల్లి మసేనురావు, ఉమ్మిడి కొండయ్య, చేపల బాలకృష్ణ, ధోని ఎర్రయ్య, కొవిరి బంగారయ్య, దోని కాసుబాబు, అప్పన్న, ఎరిపల్లి శివకోదండరావు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

### 29వ వార్డులో కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు ఆధ్వర్యంలో

## బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆర్థిక సహాయంతో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : స్థానిక 29వ వార్డులో జీవీఎంసీ ప్రైమరీ హై స్కూల్ ప్రకాష్ రావు పేట ఏరియాలో కన్నయ్యపేట లో ఉన్న జీవీఎంసీ ప్రైమరీ హై స్కూల్ లో స్థానిక వార్డు కార్పొరేటర్ వురికిటి నారాయణ రావు ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ఆర్థిక సహాయంతో స్కూల్లో ఉన్న సుమారు 760 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్ మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలుపరుస్తున్న నవరత్నాలు మార్గదర్శకత్వంలో నడుస్తూ చిన్న చిన్న సేవ కార్యక్రమాలు చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలియజేయడం జరిగింది. అలాగే దక్షిణ నియోజకవర్గంలో ఎవరికి ఏ సహాయం కావలసి వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు ప్రవేశపెట్టిన నవరత్న పథకాలలో అన్ని పథకాలు ప్రజలకు చేరువయ్యే విధంగా పనిచేస్తూ అమ్మ ఒడి, విద్యాదీవెన, నాడు నేడు, చేయూత, వంటి మహత్తర కార్యక్రమలు చేపట్టి దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా వెలుగొందుతున్నారు అని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కోడూరు అప్పల రత్నం, బిపిన్ జైన్, మరియు మాజీ కార్పొరేటర్లు బోదులపాటి ఉమామహేశ్వరరావు, పచ్చిరపల్లి రాము, మరియు స్కూల్ ప్రదోనోపాద్యులు, సిబ్బంది స్థానిక వైఎస్ఆర్సిపి నాయకులు కండిపల్లి సతీష్ కుమార్, చొల్లంగి శేఖర్, పల్లా రాధలక్ష్మి, సారి పిల్లి వెంకటరమణ, నర్సింగ్, అప్పలరాజు, ఓమ్మి కిషోర్, సింగంపల్లి వెంకట్, మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# వామనావతారంలో జగన్నాథస్వామి



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : భీమిలిలో శ్రీ సుభద్రా జగన్నాథ స్వామి కళ్యాణ రథోత్సవాలలో భాగంగా భీమిలి జగన్నాథ స్వామి ఆలయంలో స్వామి వారు బుధవారం వామనావతారం లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆద్యాత్మిక ప్రవచనాలు జరగనున్నట్లు వంశపారంపర్య అర్చకులు రొంపిచెర్ల సింగరాచార్యులు తెలిపారు.

# విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ



సబ్బవరం (విజయభాను న్యూస్) : మండలంలోని నారపాడు పంచాయితీ శివారు అమ్ముల పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జగనన్న విద్యా కానుక మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మట్టా హరికృష్ణ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక కింద ప్రతి విద్యార్థికి ఉచితంగా మూడు జతల యూనిఫాం, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూల్ బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, డిక్షనరీలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. పేరెంట్స్ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, పాఠశాల ప్రహరీ నిర్మాణానికి గ్రామస్తులందరు సహకరించాలని, పాఠశాలకు వేళ్ళే దారి చిత్తడిగా, బురదగా మారి విద్యార్దులు నడవలేక జారిపడుతున్నారని, రోడ్డు నిర్మాణానికి మరల అధికారులు దృష్టికి తీసుకువెళ్ళాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ సాడి శ్రీలక్ష్మి, అంగన్వాడీ టీచర్ నాగమణి, శ్రీనివాస వర్మ, స్కూల్ కమిటీ సభ్యులు మరియు తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు విత్తనాలు పంపిణీ చేసిన భాస్కర్



అనకాపల్లి (విజయభాను న్యూస్) : వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు ఖరీఫ్ పంట కు ప్రభుత్వం రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఆర్జిఎల్, సమ ముసూరి సుమారు 400 బస్తాల విత్తనాలను 80వ వార్డు ఇన్చార్జ్ కొణతాల భాస్కరరావు పంపిణీ చేశారు, ఈ కార్య క్రమంలో వ్యవసాయ శాఖ ఏఈఓ శివ నాగేశ్వరరావు, అజయ్, రైతు నాయకులు బీశెట్ట కృష్ణ అప్పారావు, కోరుమిల్లి ఆరుద్ర, పెంటకోట సన్యాసినాయుడు, ఎన్ ఎం అప్పారావు, విల్లూరి శేఖర్, రైతులు ప్రజలు పాల్గొన్నారు

# విజయభాను
## సంపాదకీయం

### జిఎస్టీ మరింత భారం

వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) విధానమే ఒక భారాల కుంపటి కాగా తాజాగా ప్రజలపై ముఖ్యంగా సామాన్య కుటుంబాలపై భారం పడేలా కౌన్సిల్ నిర్ణయాలు తీసుకోవడం దారుణం. చండీ గఢ్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో మంగళ, బుధ వారాల్లో జరిగిన భేటీలో తీసుకున్న నిర్ణయాలు ద్రవ్యోల్బణం మరింత పెరగడానికి దారి తీస్తాయి. ఇప్పటివరకూ పన్ను మినహా యించబడిన ప్యాక్ చేసిన, లేబుల్ వేసిన మాంసం, చేపలు, పెరుగు, పన్నీర్, తేనె, గోధుమలు, ఇతర తణధాన్యాలు, బెల్లం, అటుకులు, మొర్మరాలు తదితర ఉత్పత్తులపై ఇకమీదట 5 శాతం పన్ను విధించాలని నిర్ణయించారు. దానికి పన్నుల హేతుబద్ధీకరణ అని ముద్దు పేరు పెట్టారు. విద్యార్థులకు ఉపయోగపడే పెన్సిల్ చెక్కుకునే షార్పెనర్, అట్లాస్ సహా మ్యాప్‌లు, చార్ట్‌లపైనా పన్ను పెంచారు. ఇదీ మోడీ మార్కు విద్యాభివృద్ధి! ఇంధన ఆదాకు, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఎల్‌ఇడి విద్యుత్ బల్బులు, ఫిక్సర్లు, సోలార్ వాటర్ హీటర్, విద్యుత్ వాహనాలకు పన్ను పెంచడం దారుణం. చెప్పుల పైనా పన్ను పెంచారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరగడంతోపాటు, ఆహారోత్పత్తుల ధరలు ఆకాశాన్ని అంటాయి. ఎగిసిపడుతున్న ద్రవ్యోల్బణం జిఎస్టీ కౌన్సిల్ తాజా నిర్ణయంతో మరింత పెరుగుతుంది. ఆపై వడ్డీ రేట్లు, ఇతర రేట్లు పెరిగి సామాన్యుల జీవనం మరింత దుర్భరమవుతుంది. ప్రజలపైన ఇన్ని భారాలు మోపిన సర్కారు క్యాసినోలు, ఆన్‌లైన్ గేమింగ్, గుర్రపు పందేలు, లాటరీలపై 28 శాతం పన్నులు వసూలు చేయాలనే ప్రతిపాదనను వాయిదా వేయడం గమనార్హం. ఆహారోత్పత్తులను, విద్యా సౌకర్యాలను మరింత ప్రియం చేసింది కాని జూద క్రీడలపై నిర్ణయం చేయడానికే వెనక్కు తగ్గడాన్నిబట్టి జూద క్రీడా గృహాల నిర్వాహకులకు, ఆన్‌లైన్ పేరిట సొమ్ము చేసుకుంటున్న వారి ప్రయోజనాలకు బిజెపి కొమ్ము కాస్తోందని విదితమవుతోంది.

రాష్ట్రాలకు జిఎస్టీ పరిహారం పొడిగింపు అంశం ఎజెండాలో ఉన్నప్పటికీ కౌన్సిల్ ఏ నిర్ణయమూ తీసుకోకపోవడం దుర్మార్గం. 2017 జులై 1 నుంచి దేశ వ్యాప్తంగా జిఎస్‌టి అమల్లోకి వచ్చింది. కొత్త పన్ను విధానంలో ఐదేళ్ల పాటు రాష్ట్రాలకు ఆదాయ నష్టం జరిగితే ఆ మొత్తాన్ని కేంద్రం భరించాలనేది జిఎస్టీ చట్ట ప్రధాన నిబంధన. ఐదేళ్లు పూర్తి అవుతుంది కనుక 2022 జులై 1 నుండి పరిహారం నిలిపివేయనున్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ఇటీవల వెల్లడించడంతో కరోనా సంక్షోభ నేపథ్యంలో మరికొంత కాలం పరిహారం చెల్లింపు హామీని కొనసాగించాలని అన్ని రాష్ట్రాలు ముక్తకంఠంతో కోరాయి. చాలా కాలంగా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు విన్నవిస్తూనే వున్నాయి. ఇంత కీలకమైన ఎజెండాపై కౌన్సిల్ ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడం రాష్ట్రాల హక్కులను తృణీకరించడమే! పన్ను ఆదాయం పెంచుకోలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలను ఆదుకునేందుకు అప్పులు చేస్తామంటే ఎఫ్‌ఆర్‌బిఎం నిబంధనల పేరిట మోకాలడ్డుతూ మరోవైపు ప్రజలపై భారాలు మోపే 'సంస్కరణల'ను అమలు చేస్తే అదనపు అప్పును అనుమతిస్తామని విషమ షరతులు విధిస్తోంది. బిజెపి చెప్పే సహకార ఫెడరలిజం ఇదేనా ?

జిఎస్టీ విధానం వస్తే రాష్ట్రాల సొంత ఆర్థిక వనరులకు ముప్పు ఏర్పడుతుందని తొలి నుండీ పలువురు మొత్తుకుంటూనే వున్నారు. అయినా మోడీ సర్కారు మొండిగా తీసుకొచ్చింది. దాని దుష్పరిణామాలు ఇప్పటికే తేటతెల్లమయ్యాయి. ఇప్పుడు మరింత నష్టకరంగా పరిణమిస్తున్నాయి. ప్రజలపై అధిక పరోక్ష పన్నులు వేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విడనాడాలి. సర్కారు ఆదాయానికి సంపన్నులపై ప్రత్యక్ష పన్నులను పెంచాలి. కానీ మోడీ సర్కారు తీరు తిరకాసుగా ఉంది. సంపన్నులకు, దేశ విదేశీ కార్పొరేట్లకూ పన్ను మినహాయింపులు, రాయితీలిస్తోంది. రెండేళ్ల క్రితం 30 శాతంగా వున్న కార్పొరేట్ టాక్స్‌ను 22 శాతానికి తగ్గించడం మూలంగా కేంద్ర ఖజానా ప్రతి ఏటా లక్షన్నర కోట్ల రూపాయలు కోల్పోతోంది. కేంద్ర ప్రభుత్వ పన్ను విధాన ప్రాతిపదికలు మారాలి. సామాన్యులపై పరోక్ష పన్నులను తగ్గించాలిబీ సంపన్నులకు రాయితీలివ్వడం మాని ప్రత్యక్ష పన్నులు పెంచాలి. ఆ దిశగా నిర్ణయాలు తీసుకునేలా ప్రజా ఉద్యమాల ఒత్తిడి పెంచాలి.

# రాజ్యసభకు ఇళయరాజా, విజయేంద్రప్రసాద్..



దిల్లీ: కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రపతి కోటాలో నలుగురు దక్షిణాది ప్రముఖులను రాజ్యసభకు నామినేట్ చేసింది. ప్రముఖ దర్శకుడు రాజమౌళి తండ్రి, సినీ కథా రచయిత వి.విజయేంద్ర ప్రసాద్‌తో పాటు సంగీత దిగ్గజం ఇళయరాజా, పరుగుల రాణి పీటీ ఉషా, సామాజిక సేవకుడు వీరేంద్ర హెగ్డేలను రాజ్యసభకు నామినేట్ చేసింది. ఈ సందర్భంగా వారు అందించిన సేవల్ని గుర్తు చేసుకుంటూ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఆ నలుగురు ప్రముఖులకూ అభినందనలు తెలిపారు. ప్రముఖ అథ్లెట్ పీటీ ఉషా జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రధాని మోదీ అన్నారు. క్రీడా రంగంలో ఆమె సాధించిన విజయాలు అందరికీ తెలిసినప్పటికీ గత కొన్నేళ్లుగా వర్ధమాన క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఆమె చేసిన కృషి కూడా ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. రాజ్యసభకు నామినేట్ అయిన సందర్భంగా ఆమెకు కృతజ్ఞతలు తెలుపుతూ ఫొటోను షేర్ చేశారు. అలాగే, సంగీత దిగ్గజం ఇళయరాజా సంగీతం ఎన్నో భావాలకు ప్రతిబింబమని.. అనేక తరాలకు ఆయన సంగీతం వారధిలా నిలిచిందని మోదీ కొనియాడారు. ఆయన జీవిత ప్రయాణం కూడా ఎంతో స్ఫూర్తిదాయకని.. అలాంటి వ్యక్తి రాజ్యసభకు నామినేట్ కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అలాగే, విజయేంద్ర ప్రసాద్ దశాబ్దాల పాటు సృజనాత్మక సేవలు అందించారని.. ఆయన సేవలు మన సంస్కృతిని విశ్వవ్యాప్తం చేశాయన్నారు. వీరేంద్ర హెగ్డే గొప్ప సమాజ సేవకుడని మోదీ కొనియాడారు. ధర్మస్థల ఆలయంలో ప్రార్థనలు చేసే అవకాశం తనకు దక్కిందని.. ఆరోగ్యం, విద్య, సాంస్కృతిక రంగంలో ఆయన చేసిన గొప్ప కృషిని చూశానని తెలిపారు. ఇలాంటి వ్యక్తుల ద్వారా పార్లమెంట్ కార్యకలాపాలను సుసంపన్నం అవుతాయని పేర్కొన్నారు.

# కుదుటపడని లాలూ ఆరోగ్యం.. ఎయిమ్స్‌కు తరలింపు..



పట్నా: రాష్ట్రీయ జనతాదళ్ అధినేత, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌)ను మెరుగైన చికిత్స నిమిత్తం ఎయిమ్స్‌కు తరలిస్తున్నారు. ఇటీవల ఇంట్లో మెట్లపై నుంచి జారిపడటంతో లాలూ గాయపడ్డారు. వీపు భాగానికి గాయమై భుజం విరగడంతో ఆయనకు పట్నాలోని పారస్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. అయితే ఆయన పరిస్థితి నిలకడగానే ఉన్నప్పటికీ.. ఎలాంటి మెరుగుదల లేకపోవడంతో దిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఈ రోజు సాయంత్రంలోగా ఎయిర్ అంబులెన్స్ ద్వారా ఆయన్ను తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆ సమయంలో ఆయన వెంట భార్య రబ్రీదేవీ, ఇద్దరు కుమారులు తేజ్ ప్రతాప్ యాదవ్, తేజస్వి యాదవ్, కుమార్తె మిసా భారతి వెళ్లనున్నారని పేర్కొన్నాయి. గతంలో కూడా ఆయన ఎయిమ్స్‌లో వైద్య సహాయం పొందారు.

జారిపడిన గాయాలతో పాటు ఆయన్ను ఇతర ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నాయి. మూత్రపిండాలు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లతో ఆయన బాధపడుతున్నారు. మూత్రపిండ మార్పిడి చికిత్స కోసం విదేశాలకు వెళ్లేందుకు ఎదురుచూస్తున్న తరుణంలో ఈ ప్రమాదం జరిగింది.

ఇదిలా ఉండగా.. ప్రధాని మోదీ లాలూ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, ఆ పార్టీ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్ పట్నాలో ఆసుపత్రికి వచ్చి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఆసుపత్రి ఖర్చులు భరిస్తుందని, అది ఆయన హక్కు అని వెల్లడించారు.

# నిస్వార్థ సేవలే గుర్తింపు ఇస్తాయి

శ్రీకాకుళం : ప్రభుత్వ ఉద్యోగిగా చేసిన నిస్వార్థ సేవలే గుర్తింపు ఇస్తాయని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.ఎం.కిశోర్ పేర్కొన్నారు.ఐదేళ్ల పాటు స్థానిక వెటర్నరీ పోలీ క్లినిక్ లో సహాయ సంచాలకులుగా పనిచేసి విశాఖపట్నంకు బదిలీపై వెలుతున్న డా.మాదిన ప్రసాదరావు అభినందన వీడ్కోలు సభ స్థానిక వెటర్నరీ పోలీ క్లినిక్ ఆవరణలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ఆయన ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ ఎంతో విలువైన సేవలు అందించి ప్రసాదరావు అందరికి ఆదర్శంగా నిలిచారని, మూగ జీవాల వర ప్రసాదం అయ్యారని అన్నారు.28 సంవత్సరాల కర్తవ్య నిర్వహణలో రైతుల, అధికారుల, ప్రజా ప్రతినిధుల మన్నలను పొందారని అన్నారు.

## సమయం

# కష్టాలే దేవుడిని గుర్తుచేస్తాయా ?

సుఖముగా వున్న మనిషికి కన్నూ మిన్నూ కానదు. తన భాగ్యానికి తానే కారణ మంటూ విర్రవీగుతాడు. అదే వారికి కష్టములు కలిగితే దానికి వారు కారణం వీరు కారంణం అంటూ ముందుగా పరులను నిందించడం పరిపాటి. తరువాత మనుషులు తమకు సమస్యలు ఎదురైనప్పుడు దేవుడిని తలచుకుంటారు. తమను బాధలు పెడుతున్నావంటూ నిందిస్తారు. తమను కాపాడమని ప్రాధేయపడతారు. మానవుడు సుఖములతో తులతూగునాడు దైవాన్ని విస్మరించడం, దుఃఖంలో స్మరించడం ఒక అలవాటుగా మారిపోయింది. ఇదే మానవులు చేస్తున్న అతి పెద్ద తప్పు. అంతా బాల్య దశ నుండే రోజూ కొంతసేపు దేవుడిని స్మరించడం అలవర్చుకోవాలి. అప్పుడు మనకు కష్టములు కలుగవు. మనకు కష్టములు, సుఖములు కలిగించువాడు దేవుడే అని నమ్మినప్పుడు ముందుగానే ఆయనను ఆశ్రయించాలి. నీవే దిక్కు మేము నిమిత్త మాత్రులం అని వేడుకోవాలి. అప్పుడు మనకు కష్టములను తప్పించు ఉపాయము లభిస్తుంది. సుఖదుఃఖములు రెండింటిలోనూ భగవన్నామస్మరణ చేసేవానికి మాత్రమే స్వర్గం ప్రాప్తిస్తుంది. అటువంటి వానిపై భగవంతుడు త్వరగా తన కరుణను జూపుతాడు. కాబట్టి నిత్య దైవనామస్మరణే మనలను కష్టములకు దూరంగా వుంచగలదు అని తెలుసుకోండి. ఈ విషయాన్ని గురించి ఓ శతక పద్యాన్ని మననం చేసుకుందాం.

చింతలలో పరమాత్ముని
చింతింతురు, శాంతిగన్న చింతింపరు, యా
చింతను సుఖదుఃఖంబుల
జింతించిన పరమ సుఖము జిక్కును కుందా!

...రచన
వడ్లమాని అన్నపూర్ణ

# పంచాంగం

మాసం : ఆషాఢ; తిథి : అష్టమి ప.2.14; హస్త ఉ.8.20; సా.వ.4.15ల 5.50.

గురువారం 07-07-2022

a **మేషం** : వడ్డీ వ్యాపారస్థులకు లాభం. కుటుంబ కలతలు అంత రించును. మానసిక ఆందోళన తగ్గును. గౌరవ మార్యాదలకు లోటు రాదు. చేయుపనులు కలిసివచ్చును. పెద్దల ఆరోగ్యం గురించి ఆందో ళన చెందుతారు.

b **వృషభం** : సామాన్య ఫలితం కొన్నింటి యందు అపజయం. స్తోమతకు మించి విలాసములు చేయుట. ఖర్చులు అధికము. క్రయ విక్రయములు చేయుట. మిత్రులు సహాయసహకారం కలుగును. మీ శక్తికి మించిన పనులు చేయుట వలన ధనవృద్ధి కలుగును. మనోధైర్యము పెరుగును. కార్యజం.

c **మిథునం** : ఉపాధ్యాయులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు.

d **కర్కాటకం** : స్త్రీలు చీటికి, మాటికి అసహనం, చికాకులు అధిక మవుతాయి. అయిన వారిని, ఆప్తులనువిందు భోజనానికి ఆహ్వానిస్తారు. ఆకస్మిక ప్రయాణాలు వాయిదాపడతాయి. నిరుద్యోగులు ఒక ప్రకటన పట్ల ఆకర్షితులవుతారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అనుకూలిస్తాయి.

e **సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి.

f **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి.

g **తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు.

h **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు.

i **ధనుస్సు** : ఆర్థిక లావాదేవీలు, కుటుంబ సమస్యలు సమర్థంగా పరిష్కరిస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగి స్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించ వలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు.

# శుభ ఫలితాలనిచ్చే సుబ్రమణ్యస్వామి

## సంకీర్తన



ఒకే శరీరంలో ఆరుముఖాలు పన్నెండు చేతులు గల కార్తికేయునికి సహాయకులుగా పార్వతిదేవి నూపురం నుంచి తొమ్మిది మంది వీరులు జనించారు. వీరబాహు, వీరకేసరి, వీర మహేంద్ర, వీర మహేశ్వర, వీర పురంధర, వీర రాక్షస, వీర మార్తాండ, వీరాంతక, వీర ధీర అని వారిని పిల్వడం జరుగుతోంది. విష్ణు ఆదేశం మేరకు శివుడు ఆ బాలుని నుంచి ప్రణవోపదేశం పొందాడు. ఆ కారణంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి, శివగురు, స్వామినాథ, దేశిక అనే పేర్లు వచ్చాయి. కుమారస్వామి ఇంద్రుని కుమార్తె అయిన దేవయానిని, శివమూర్తి కుమార్తె వల్లీదేవిని వివాహమాడాడు. అలాగే ఆ స్వామి నెమలిన తన వాహనంగానూ, కోడి పుంజును తన ధ్వజంగానూ చేసుకున్నాడు. ఆ కారణంగా స్వామి శిఖివాహనుడు, కుక్కుట ధ్వజుడయ్యాడు. సుబ్రమహ్మణ్యేశ్వ రుడి ధ్వజమందు కోడి పుంజు ఉంటుంది. కో అనే ధ్వని ప్రణవమును సూచిస్తుంది. జ్ఞాన భానూదయము నకు ధ్వని సంకేతం. అలాగే స్వామి వాహనమైన నెమలి పురివిప్పి నర్తించునపుడు ఓంకార రూపంలో ఉంటుంది. ఆ కారణంగా స్వామిని ప్రణవ స్వరూపుడిగా చెబుతారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సేవించే సమయంలో ఉరగేశ్వ రాయనమః మహోరణాయనమః అని కీర్తించడం జరుగుతోంది. వల్లీదేవి స్వరూపంలో ఉన్నదని, స్వామి కూడా సర్ప రూపంలో ఉంటాడని పురాణాల ద్వారా అవగతమవుతోంది.తెలుగు రాష్ట్రాలలో సుబ్రహ్మణ్య షష్టి పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఈ పర్వదినం రోజున స్వామికి ఘనంగా పూజలు నిర్వహిస్తారు. సుబ్ర హ్మణ్య షష్టిరోజున వేకువ జామునే నిద్రలేచి తలంటు స్నానం చేస్తారు. అనంతరం సుబ్ర హ్మణ్యేశ్వరునికి సమర్పిం చడానికి చిలీ (నువ్వులు, బెల్లంతో కలగ లిపినది) తయా రుచేసి, కొబ్బరి కాయలు, అరటి పళ్ళు, పాలు, కోడిగుడ్లతో బయలు దేరుతారు. సుబ్ర హ్మణ్యేశ్వరుడు సర్పా కారుడు కావ డంవల్ల సమీప ప్రాంతాలలో ఉన్న పుట్టలకు చేరుకుని పుట్టను శుద్ధిచేసి, పసుపు, కుంకుమ బొట్లు, అందమైన ముగ్గు లతో అలం కరిస్తారు. అనంతరం, పాలు కోడి గుడ్లను పుట్టలలోవేసి, ప్రసాదాలను, కొబ్బరి కాయలను నివేదిస్తారు. స్వామిని భక్తితో పూజిస్తూ, భజన గీతాలు, భక్తి పాటలతో కీర్తిస్తారు. అనంతరం పుట్ట మన్నును తమ చెవులకు రాసుకుంటారు. అలా చేయడంవల్ల తమకు చెవికి సంబంధించిన వ్యాధులు దరిచేరవని నమ్ము తారు. అలాగే మహిళా భక్తులు, పుట్టలో పాలుపోసి, పుట్ట చుట్టూ భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణలు చేస్తారు. సంతాన ప్రాప్తికోసం స్వామిని మనసావాచా ఆరాధిస్తారు. పిల్లలు, స్వామికి ప్రణామాలు అర్పించి మందుగుండు సామాను కాలుస్తారు.

అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే సుబ్రహ్మణ్య ఆరాధన శక్తిని, ఐశ్వర్య మహాద్భా గ్యాలను కల్గిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఆ సుబ్రహ్మణ్యే శ్వరుని అపార కృపా రసామృతం అందరిమీదా వెల్లి విరి యాలని మనసావాచా అందరూ పూజిస్తారు. పార్వతీ పరమేశ్వరుల ప్రేమకు, అనుగ్రహానికి ఐక్యరూపం సుబ్రహ్మణ్య స్వామి. స్వామి అనే నాయ ధేయం కేవలం సుబ్రహ్మణ్యానికి సొంతం. దేవ సేనాధిపతిగా, సకల దేవగణాల చేత పూజ లందుకునే దైవం కుమారస్వామి అని పురాణాలు చెబు తున్నాయి. అలాంటి షణ్ముఖుని అనుగ్రహం పొందగలిగితే స్కంద పంచమి, కుమార షష్టి రోజున స్వామని పూజించాలి. కుమారస్వామని పూజిస్తే గౌరీశంకరుల కటాక్షం మనకు లభించినట్టేనని పురాణాలు చెబు తున్నాయి. శివపార్వతుల తనయుడైన కుమారస్వామి గంగాదేవి గర్భంలో పెరిగాడు. ఆమె భరించ లేకపోవడంతో, ఆ శిశువు రెల్లుపొదల్లో జారిపడింది. ఆ శిశువును కృత్తికా దేవతలు ఆరుగురు స్తన్యమిచ్చి పెంచారు.

జారిపడినందున ఆ శిశువునకు స్కందుడని, రెల్లుగడ్డిలో ఆవిర్భవించడంతో శరవణుడని, కృత్తికా దేవతలు పెంచడంతో కార్తికేయుడని కుమారస్వామి అని పిలు స్తారు. ఇక సుబ్రహ్మణ్యునికి ఉన్న ఆరుముఖాలకు ప్రత్యేకతలు ఉన్నాయి. మయూర వాహనాన్ని అధిరోహించి కేళీ విలాసాన్ని ప్రదర్శించే ముఖం, పరమేశ్వరునితో జ్ఞానచర్చలు జరిపి ముఖం, శూరుడనే రాక్షసుని వదించిన స్వరూపానికి ఉన్న ముఖం, శరణు కోరిన వారిని సంరక్షించే ముఖం, శూలాయుధ పాణియై వీరుడిగా ప్రస్ఫు టమయ్యే ముఖం, లౌకిక సంపదల్ని అందించే ముఖం ఇలా ఆరు ముఖాల స్వామిగా ఆనందదాయ కుడిగా స్వామి కరుణామయుడిగా భక్తులచే నీరాజనాలు అందు కుంటున్నాడు. స్కంద పంచమి, షష్టి రోజుల్లో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే సకల సంపదలు, సుఖవంతమైన జీవితం చేకూరుతుందని పురో హితులు చెబుతున్నారు.

# ప్రతిష్టాకరమైన ఎఫ్‌టిసిసిఐ అవార్డును అందుకున్న మెట్రోకెమ్



పరవాడ (విజయభాను న్యూస్) : ఫార్మా రంగంలో తన దైన ముద్రతో మందుల తయారీకి అవసరమైన ఏపీఐ, ఇంటర్మీడియట్, పెల్లెట్స్ ను తయారు చేస్తున్న, మెట్రోకెమ్ ఏపీఐ ప్రైవేట్ లిమిటెడ్ తన ప్రస్థానంలో మరో మైలు రాయిని చేరుకుంది.

ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అంది ంచే ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకొని ఘనత సాధించింది.

ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అవార్డు 2021లో అన్ని రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి 'ఎక్సలెన్స్ ఇన్ ఆల్ రౌండ్ పెర్మార్మెన్స్ అవార్డు'ను జులై నాలుగున హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన సమావేశంలో మంత్రి కేటీఆర్ పరిశ్రమలు మినిస్టర్ ఫర్ ఇండస్ట్రీస్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్మెంట్ ఐటీ, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్స్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేష్ రంజన్ చేతుల మీదుగా ఈ అవార్డును సంస్థ సీఎండీ డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు, డైరెక్టర్ విజయలక్ష్మి, సీఓఓ హర్షవర్ధన్, సీఎస్ఓ హరదేవ్ లు ఈ అవార్డును అందుకున్నారు.

ఇదే ఉత్సాహంతో...

మరిన్ని అవార్డులను సాధించే దిశగా కృషి చేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు.





జగన్నాథ రథ యాత్ర సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సాయంత్రం మెలోడీ థియేటర్స్ ఆధ్వర్యంలో టర్నర్ చౌదరీ కార్యక్రమం పౌల్ట్రీలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్‌మూర్తి హాజరయ్యారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసన్న పర్యవేక్షణలో ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ డైరెక్షన్లో మెలోడీ క్రియేటర్స్ సిహెచ్.వి.సత్యనారాయణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గాయకులు ప్రభాకర్, ఫణీంద్ర, సత్య శ్రీ, రత్నకుమారి, మెలోడీ సత్యనారాయణ తదితరులు గీతాలను ఆలపించారు. భక్తి సంగీత విభావరి వ్యాఖ్యాతగా జోషిత వ్యవహరించారు.

# బాబుజగ్జీవన్ రామ్ సేవలు మరువలేనివి



ములగాడ (విజయభాను న్యూస్): మహనీయులు బాబు జగ్జీవన్ 36వ వర్ధంతిని పురస్కరించుకొని తెలుగుదేశం పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు ఊరుకూటి డేవిడ్ మాట్లాడుతూ బాబుజగ్జీవన్రామ్ దేశానికి అనేక సేవలు చేసారని ఆయన సేవలు మరువలేనివి అని అన్నారు. రైల్వే మంత్రిగ కార్మిక శాఖ మంత్రి గ వ్యవసాయ శాఖ మంత్రిగ దేశ రక్షణ మంత్రి గ చేసిన సేవలు యువతకు మార్గదర్శమని తెలియపరిచారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంటోని సెల్వ్యరాజ్ థామస్, అబ్రహం జాన్ రవికుమార్,బెన్హర్ ,క్రిస్టియన్ మైనార్టీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# కళ్లు రఘుకు ఏయూ డాక్టరేట్ ప్రకటించాలి

## నగర కళాకారులు వినతి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : కళ్లు చిత్రం ద్వారా సమాజానికి గొప్ప సందేశాన్ని ఇచ్చిన ప్రముఖ దర్శకులు ఎం.వి. రఘుకు ఆంధ్ర విశ్వ కళా పరిషత్ గౌరవ డాక్టరేట్ ఇవ్వాలని నగర కళాకారులు విజ్ఞప్తి చేశారు. దాదాపు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆంధ్ర యూనివర్సిటీ ఎంతో మంది ప్రముఖులకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించిన విషయాన్ని కళాకారులు గుర్తు చేశారు. ఎం. వి. రఘు లాంటి దర్శకులకు గౌరవ డాక్టరేట్ ఇవ్వడం ద్వారా ఔత్సాహికులకు స్ఫూర్తినిచ్చినట్టు అవుతుందని వారు పేర్కొన్నారు. ప్రముఖ రంగస్థలం సినీ నటులు, రచయిత గొల్లపూడి మారుతి రావు రాసిన కళ్లు నాటికను వెండి తెరకెక్కించిన ఘనత ఎం.వి. రఘుకే దక్కుతుందన్నారు. కళ్లు సినిమా విడుదలై 34 సంవత్సరాలు పూర్తయి 35వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా రంగసాయి నాటక సంఘం బుధవారం ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సీనియర్ జర్నలిస్ట్, నటుడు ఎన్. నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సమావేశం ఆమోదం తెలిపింది. రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి మాట్లాడుతూ సమాజానికి చక్కటి సందేశం ఇచ్చిన కళ్లు సినిమా నేటికీ సజీవ చిత్రం అన్నారు. ఎం. వి. రఘు తన జీవితంలో కళ్లు, ఆర్తనాదం అనే రెండు సినిమాలకు దర్శకత్వం వహించగా 50 సినిమాలు పైగా సినిమాటోగ్రాఫర్ గా బాధ్యతలు నిర్వహించారని వివరించారు. సినిమాటోగ్రాఫర్ గా, దర్శకునిగా అపారమైన అనుభవం కలిగిన రఘు ప్రస్తుతం చలనచిత్ర సాంకేతిక కళాశాలలో డీన్ గా కొనసాగుతున్నారని ఆయన వివరించారు. పలువురు ఔత్సాహికులను సినిమాటోగ్రఫీ వైపు తీసుకెళ్లిన ఘనత రఘుకే దక్కుతుందన్నారు. విద్యావేత్తగా, కెమెరామెన్ గా దర్శకునిగా అధ్యాపకునిగాఅపార అనుభవం కలిగిన రఘుకు ఆంధ్ర విశ్వ కళాపరిషత్ గౌరవ డాక్టర్ ప్రదానం చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక అతిథిగా హాజరైన విశాఖ ఫిలిం సొసైటీ అధ్యక్షులు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ రఘు లాంటి ఉత్తమ దర్శకునికి గౌరవ డాక్టరేట్ ఇవ్వడం అనేది ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఈ యొక్క బాధ్యత తీసుకోవాలని ఆయన కోరారు. దర్శకుడు ఎమ్ వి రఘు మాట్లాడుతూ విశాఖపట్నంతో ఎంతో అవినాభావ సంబంధం ఉందని చెప్పారు. అందుకనే 34 ఏళ్ల క్రితం కళ్లు సినిమాను విశాఖపట్నం లోనే చిత్రీకరించి ఘన విజయం సాధించామని ఆయన వివరించారు. ప్రస్తుతం తాను చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా సినిమా నిర్మాణంలో ఉన్నట్లు చెప్పారు. నిర్మాతలు ఎవరైనా ముందుకు వస్తే సినిమా పూర్తవుతుందని ఆయన పేర్కొన్నారు. పిల్లల చిత్రాన్ని విశాఖపట్నంలోనే తీసే ఆలోచన ఉన్నట్లు రఘు తెలిపారు. ఈకార్యక్రమంలో నగర కళాకారులు శివజ్యోతి, హేమ, జమ్మా చిన్నబాబు, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



అన్నవరం(విజయభాను న్యూస్) : పోడూరు విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సర్పంచ్ గొట్టుముక్కల సోనియా రమేష్ అన్నారు. గుమ్మలూరు లోని మండల పరిషత్ ప్రాథమిక ప్రధాన పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్య కుమార్ అధ్యక్షతన పాఠశాలలో బుధవారం జరిగిన జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొట్టుముక్కల సోనియా రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు కిట్లను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ సోనియా రమేష్ మాట్లాడుతూ మంచి విద్య కోసం చేసే ఖర్చు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పెట్టుబడిగా తలంచి ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్ రెడ్డిగారు అందిస్తున్న జగనన్న విద్యాకానుక,అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద మొదలైన ప్రభుత్వ పథకాలను ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. యం.పి.టి.సి అంబటి సుధాకర్ మాట్లాడుతూ మంచి చదువులు చదివినవారికే సమాజంలో సముచిత స్థానం లభిస్తుందనే విషయాన్ని విద్యార్థులు అర్థంచేసుకుని మంచి చదువులు చదవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలోసి.ఆర్.పి యం.శాంత కుమారి, పేరెంట్స్ కమిటీ సభ్యులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# వ్యాధులు సోకకుండా టీకాలు



భీమునిపట్నం( విజయభాను న్యూస్ ) : పెంపుడు జంతువులుకు ప్రతీ ఏడాది యాంటీ రాబిస్ టీకాలు వేయడం ద్వారా వాటికి ప్రాణాంతకమైన వ్యాధులు సోక కుండా కాపాడడానికి అవకాశం కలుగుతుందనీ భీమిలి పశువైద్యశాల సహాయ సంచాలకులు డా.బి.వెంకటరమణ అన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా బుధవారం భీమిలి పశువైట్కాద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనోసిస్ వ్యాధులు గాలి, నీరు, ఆహారం, కలుషితమైన పశు ఉత్పత్తులను విని యోగించడం ద్వారా ఎక్కువగా వ్యాపి స్తాయని చెప్పారు. పిచ్చికుక్క కరవడం ద్వారాకూడా ఈ వ్యాధి సోకుతుందనీ చెప్పారు.

జూనోసిస్ వ్యాధులు ఎక్కువగా పశువులు, జంతువులతో దగ్గరగా వుండే వారికి సోకుతుందనీ తెలిపారు.

ఈ కార్యక్రమం ఈ నెల 15 వరకు నిర్వహిస్తామని చెప్పారు.

## శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి

భీమునిపట్నం : విజయ భాను న్యూస్ తగరపువలస మండలం అధ్యక్షులు శీరపు రామలక్ష్మి ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివళులర్పించారు. ఈ కార్యక్రమం లో మండలం ప్రధాన కార్యదర్శి కురుమెళ్ల కవిత విజయ రేఖ కరుణ , కురుమెళ్ల వెంకటేశ్వర రావు ధరణి తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక ప్రాంతాల్లో విజిలెన్స్ దాడులు

విశాఖపట్నం : పర్యాటక ప్రాంతాల్లో దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపా రులు ఎమ్మార్పీ కంటే అధిక రేట్లకు వస్తువులు విక్రయిస్తున్నారని అందిన ఫిర్యాదుల మేరకు ఎస్పీ స్వరూపారాణి ఆదేశాలతో విజిలెన్స్ అధికారులు, తూనికలు కొలతల శాఖ అధి కారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. పర్యాటకులు ఎక్కువగా సందర్శించే కైలాసగిరి, తెన్నేటిపార్క్, వుడా పార్క్, ఆర్కేబీచ్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిం చారు. అధిక ధరలకు వస్తువులు అమ్ము తున్నట్లు నిర్ధారించుకుని పదిహేను దుకాణా లపై కేసులు నమోదుచేసి జరిమానా విధించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ విభాగం సీఐ జి.కోటేశ్వరరావు, ఏజీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కుటుంబాలను ఆదుకోవాలి





అచ్యుతాపురం (విజయభాను న్యూస్ ) : ప్రభుత్వం చేనేత కార్మికులను గుర్తించి వారికి చేయూతనివ్వాలని పద్మశాలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పప్పు రాజారావు కోరారు. బుధవారం మండల కేంద్రంలో గల దుప్పితూరు చేనేత సహకార సొసైటీ వద్ద అద్యక్షులు మాడెం నూకరత్నం సూరి అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్య బుజ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ అద్యక్షులు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ నేతన్న నేస్తం అందివ్వాలన్నారు. అలాగే గత మూడు సంవత్సరాల నుండి నేతన్న నేస్తం చేయూత అందక ముడి సరుకులు కొనుగోలు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 50 సంవత్సరాలు నిండిన టైలర్లను కూడా చేనేత కార్మికులుగా గుర్తించి పెన్షన్ మంజూరు చేయాలన్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంగా దుప్పితూరు సొసైటీ ఆధ్వర్యంలో చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ కన్వీనర్ దేశంశెట్టి శంకరరావు, సర్పంచ్ కూండ్రపు విమలానాయుడు, ఎంపిటీసీ ద్వారపురెడ్డి వెంకటలక్ష్మి బాబ్జి, సంఘం మేనేజర్ సర్పంచ్ మాడెం అప్పారావు, పప్పు సన్యాశిరావు, పచ్చారపు గోవిందరావు, టైలర్ సంఘం అద్యక్షులు శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ముఖర్జీ జయంతి వేడుకలు



అనకాపల్లి ( విజయభాను న్యూస్) : భారతీయ జనతా పార్టీ అనకాపల్లి జిల్లా పార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ 121వ జయంతి వేడుకలలో భాగంగా వారి చిత్ర పటానికి పూలదండ వేసి జ్యోతి ప్రజ్వలణతో కార్యక్రమాన్ని మొదలుపెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జ్ ఎస్వీఎస్ ప్రకాష్ రెడ్డి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ గండి వెంకట సత్యనారాయణ రావు మాట్లాడుతూ ఆనాటి శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ఈనాటి మన ప్రియతమ ప్రధాన మంత్రి అయిన శ్రీనరేంద్ర మోడీ గారు ఆచరణలోకి తీసుకు వచ్చారని మాట్లాడారు. జాతీయ విధానాన్ని మరియు జాతీయ శక్తులను బలోపేతం చేసే విధంగా జనసంగ్ పార్టీని స్థాపించి మొదటి అధ్యక్షుడిగా దిగ్విజయంగా పార్టీని ముందుకు నడిపించారని చెప్పారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ గారి ఆశయాలను ఈతరం యువత అంతా వారి అడుగుజాడల్లో నడవాలని ప్రతీ కార్యకర్త మీ బూత్ పరిధిలో పార్టీని బలోపేతం చేసి అనకాపల్లి పార్లమెంట్ సీట్ గెలిచే విధంగా పనిచేయ్యాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ద్వారపురెడ్డి పరమేశ్వర రావు , అనకాపల్లి అసెంబ్లీ కన్వీనర్ కర్రి రామకృష్ణ , వివిధ మోర్చా అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 8,9 తేదీలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న

# రాష్ట్ర స్థాయి వైఎస్ఆర్సీపీ ప్లీనరీ కార్యక్రమం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) ఈ నెల 8,9 తేదీలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నరాష్ట్ర స్థాయి వైఎస్ఆర్సీపీ రాష్ట్ర ప్లీనరీ ప్రాంగణ సముదాయాన్ని పలువురు ప్రముఖులు దర్శించి సూచనలు సలహాలు ఇచ్చారు.ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సమీపంలోని విశాల మైదానంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి ప్లీనరీ జరుగుతున్న విషయం విదితమే.రాష్ట్రం నలు మూలల నుంచి లక్షలాదిగా ప్లీనరీ కి హాజరవుతున్న నాయకులు, కార్యకర్తలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ముఖ్యమంత్రి జగ న్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారని, రాష్ట్రంలో మరోసారి అధికారం చేజిక్కించుకోవడానికి జగన్ దిశానిర్దేశం చేస్తామని పలువురు పార్టీ నాయకులు భావిస్తున్నారు.

# లంకెలపాలెం పశువుల ఆస్పత్రిలో జువోసిస్ డే



పరవాడ (విజయభాను న్యూస్): జంతువులుద్వారా మనషులకు సంక్రమించే వ్యాదులుపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరము జులై అరోవతేదిన జువోసిస్ డే నిర్వహిస్తామనీ లంకెలపాలెం పశువైద్యాధికారిణి డాక్టర్ అశ్వినీ ప్రపుల్లా తెలిపారు. దీంట్లో బాగంగా బుధవారం 79వ వార్డులో గల లంకెలపాలెం పశువైద్యశాలలో ఈ జువోసిస్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పశు వైద్యాదికారిణి అశ్వనీ ప్రపుల్లా మాట్లడుతూ జంతువులు ద్వారా ప్రజలుకు సంక్రమించే వ్యాదులుపై ప్రజలు అందరికీ అవగాహన కల్పించారు.

ఈనెల అఖరివరకు కుక్కలుకు వ్యాక్సిన్ వేస్తామనీ అన్నారు. కొన్ని పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయిడం జరిగింది. మిగిలిన పెంపుడు కుక్కలు యజమానులు కూడా వాళ్ళు కుక్కలుకు వ్యాక్సిన్ వేయించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలానీ ఈ సందర్భంగా అమె కోరారు.జెవిఒ కళ్యాణి,ఎఎచ్ ఎ లక్ష్మణ్ ,పద్మ,ఒయస్ అప్పలరాజు,జిఎమ్ నాగేశ్వరావు తథితర్లు పాల్గోన్నారు.

# వైజాగ్ వారియర్స్ లోగో ఆవిష్కరణ




జెర్సీతో వైజాగ్ వారియర్స్ ఆటగాళ్లు

విశాఖపట్నం, (విజయభాను న్యూస్): ఆంధ్ర ప్రీమియర్ లీగ్లో ఆడే వైజాగ్ వారియర్స్ జట్టు లోగో థీమ్ సాంగ్ను సంస్థ కార్యాలయంలో విడుదల చేసినట్లు పల్స్ సిఇఒ డాక్టర్ గేదెల శ్రీనుబాబు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆంధ్రా ప్రీమియర్ లీగ్లో అన్ని జట్లు కంటే ఎక్కువ డిమాండ్ ఉన్న వైజాగ్ వారియర్స్ జట్లులో గ్రామీణ క్రికెటర్లకు ఎక్కువ అవకాశం కల్పిస్తామని, వారు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి రాణించడం ద్వారా ఐపిఎల్తోపాటు జాతీయ, అంతర్జాతీయ జట్లలో చోటు దక్కించుకునేందుకు ఇది వేదిక కానుందన్నారు. వైజాగ్ వారియర్స్ జట్టుతో బిసిసిఐ కి సంబంధించిన కోచ్, సహాయ సిబ్బందిని నియమించామని, జాతీయ, రంజీ, ఐపీఎల్ ఆడిన అనుభవం ఉన్న క్రికెటర్లు పర్యవేక్షణలో యువ క్రికెటర్లు మరింత రాణించే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా వారంతా వైజాగ్ వారియర్స్ను చాంపియన్గా నిలబెడతారని ఆశాభావం వ్యక్తం చేశారు వైజాగ్ వారియర్స్ జట్టుకు పల్స్ గ్రూపు ప్రధాన భాగస్వామిగా, నో స్పోర్ట్స్ సిఇఒ నరేంద్ర రామ్ నంబూలా, లైవ్స్పాన్ కంపెనీ మేజర్ స్పాన్సర్గా, కోస్పాన్సర్గా ఫ్లూయిట్ గ్రేడ్ న్యూస్, ఉష ప్రేమ్ హాస్పిటల్ వ్యవహరిస్తాయన్నారు. షెడ్యూల్ ప్రకారం వైజాగ్ వారియర్స్ ఈ నెల 7,9,10,11,13 తేదీల్లో మ్యాచ్లు ఆడుతుందని, విశాఖ ప్రజలు వీక్షించాలని కోరారు.

# మున్సిపల్ వర్కర్ల సమ్మెను జయప్రదం చేయండి

విశాఖపట్నం, (విజయభాను న్యూస్):రాష్ట్రంలోని అన్ని మున్సి పాలి టీలలో పనిచేస్తున్న శానిటరీ, ఇంజినీరింగ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల నిరవధిక సమ్మె ఈ నెల 11 నుంచి ప్రారంభం కానుందని, అందరూ జయప్రదం చేయాలని ఎపి రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సుబ్బా రావు, కె.ఉమామహేశ్వరరావు పిలుపు నిచ్చారు. జివిఎంసి కాంటాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన డాబా గార్డెన్స్ లోని అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రంలో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలవెన్స్, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంటు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యూటీ, పెన్షన్, ప్రమాద బీమా, సిబ్బంది పెంపు, పనిముట్లు సరఫరా, రక్షణ పరికరాలు ఇవ్వాలన్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు.

# నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు

## ఎమ్మెల్యే యు.వి రమణమూర్తి రాజు



అచ్చుతాపురం (విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఎలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తి రాజు అన్నారు. బుధవారం మండల ంలోని హరిపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాల అమలు తీరును వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉప్పవరం గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని , వైయస్సార్ విలేజ్ క్లినిక్ ను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ సుకుమార వర్మ , ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, కో జడ్పిటిసి నర్మాల కుమార్ , వైసిపి మండల పార్టీ అధ్యక్షులు దేశంశెట్టి శంకరరావు , మండలంలో గల ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు , వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# విజయరామరాజుపేట పశు వైద్యశాలలో ఘనంగా జునోసిస్ డే




అనకాపల్లి (విజయభాను న్యూస్) : పట్టణ పశుసంవర్ధక శాఖ విజయరామరాజుపేట పశు వైద్యశాల లో బుధవారం జునోసిస్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడి ప్రసాద్ రావు తో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా జులై 6 తారీఖున పశు వైద్యశాలలో పశువుల నుండి మనుషులకు వ్యాధులు రాకుంట అవగాహన సదస్సు నిర్వహిస్తూ, పశువులకు వ్యాక్సిన్లు వేస్తున్నామని అని తెలియజేశారు. పిల్లల పెంచుకునే కుక్కలకు ప్రతి ఒక్కరూ వ్యాక్సిలు వేయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏడి బి సౌజన్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పలకా యశోదరవి, కార్పొరేటర్ మందపాటి సునీత జానకిరామరాజు, వైద్యులు భాను బాబు, జిబి శ్యామల, చైతన్యమణి, తదితరులు పాల్గొన్నారు.

# గొర్లివానిపాలెం బాదుడే బాదుడు కార్యక్రమం



పరవాడ (విజయభాను న్యూస్): పరవాడ మండలం గొర్లివానీపాలెం పంచాయతీలో మాజీ సర్పంచ్ గొర్లికనకారావు అద్వర్యంలో జరిగిన బాదుడే బాదుడు కార్యక్రమానికి మాజీ మంత్రివర్యులు బండారుసత్యనారాయణమూర్తి పాల్గోనీ ఏ ఇంటికి వెళ్ళినా జగన్ ప్రభుత్వం ధరల బాదుడు భరించలేక గ్యాస్ కొనుక్కోలేని పరిస్థితిలో కట్టెల పొయ్యిపై వంటలు చేసుకుంటు ఇబ్బందులు పడుతున్న మహిళలు కనిపించారు అన్నారు. ఆనాడు నారా చంద్రబాబునాయుడు మహిళలకు ఇలాంటి ఇబ్బందులు ఉండకూడదని దీపం పథకం పెడితే ఈనాడు జగన్ మోహన్ రెడ్డి ఆ దీపాన్ని ఆపేసి మరల ఆంధ్ర రాష్ట్ర ప్రజలను ఈ విధంగా అంధకారంలోకి నెట్టేశారు అని ఎద్దేవా చేసారు.మరలా బాబు వస్తే తప్ప నిరుపేదల ఇంట్లో అనంద దీపాలు వెలగవు అని అన్నారు.వచ్చే రాజ్యం చంద్రన్న రాజ్యమనీ అన్నారు.వైసిపి ప్రభుత్వంలో పెంచిన దరలుకు వ్యతిరేకింగా కొవ్వుత్తులు నిరశన చేపట్టారు.

ఈ కార్యక్రమంలో...

మాజీ ఎంపిపి మాధం శెట్టినిలబాబు, టిడిపి జడ్పిటిసి అభ్యర్థి అట్టా సన్యాశి అప్పారావు, టిడిపి మండల పార్టి ప్రెసిడెంట్ వియ్యపు చిన్నా, మాజీ ఎంపిటిసిలుగొర్లి శ్రీనివాస్, ఇందలకొండలరావు,మాజీసర్పంచ్ లు బొండా తాతారావు, రాయవరపు దేముడు, తెలుగుయువత అద్యక్షులు పైలచినఅక్కునాయుడు, జనపాలరాము,పి.యస్ నాయుడు, అభినాయుడు,అదికసంఖ్యలో మహిళలు కార్యకర్తలు తథితర్లు పాల్గోన్నారు.

# వైయస్ఆర్ బీమా నిరుపేదలు పాలిట గొప్పవరం

## పరవాడ వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరావు



పరవాడ (విజయభాను న్యూస్): పరవాడ మండలం రావాడ గ్రామ పంచాయతీ శివారు గొల్లగుంట గ్రామము లో యస్ కె ఉస్మాన్ ఆలీ మరణించారు. యస్ కె ఉస్మాన్ అలీ భార్య గైతున్ బేగంకి 10,000 రూపాయిల వైఎస్సార్ భీమా తక్షణ సహాయం క్రింద అమెకు పరవాడవైస్ ఎంపిపి బంధం నాగేశ్వరావు రావాడ గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు చేతులు మీదుగా అందజేసారు. అనంతరము వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరావు మాట్లడుతూ వైస్ అర్ బీమా నిరుపేదలు పాలిట గొప్పవరమనీ కొనియాడారు.ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి ఎ. లక్ష్మణ రావు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ స్వాతి కుమారి , వార్డు సభ్యులు శైరా బేగం , మోటూరు హరి బాబు , గ్రామ పెద్దలు మౌలాలి , యస్ కె ఆలి , యస్ కూ హిమామ్ , జాకీర్ హుస్సేన్ , గ్రామ వాలంటీర్ యస్ కె మదీనా తథితర్లు పాల్గోన్నారు.

# పెడీక్యూరితో పాదాలకు అందం



ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో దూరం నడుస్తుంటాం. దాంతో పాదాలు ఎంతో అలసి పోతుంటాయి. అంతేకాకుండా కొంతమందికి పాదాలు పగిలి నలుగురిలో కలిసినప్పుడు ఆ పాదాలను దాచుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. అలాకాకుండా వాటిపై కొంచెం శద్ధతీసుకుంటే ఎంతో అందంగా తయారవుతాయి. అప్పుడు ఇతరుల ముందు పాదాలను దాచుకునే దుస్థితి రాదు. మీ పాదాలను అందంగా మలుచుకునేందుకు కొన్ని చిట్కాలను ఇప్పు డు తెలుసుకుందాం...అందమంటే ముఖము చక్కగా ఉంటే చాలదు. పాదాలను కూడా అందంగా ఉండాలని కోరుకుంటున్నారు నేటి ఆధునిక యువతులు. వీరి అభిలాషకు తోడుగా నగరాలలో అనేక పెడీక్యూర్ సెంటర్లు వెలిశాయి. కానీ, ఇంట్లోనే ఉండి కొన్ని చిట్కాలను పాటిస్తే సెంటర్లకు పోకుండా మనమే మన పాదాలను అందంగా చేసుకోవచ్చు.

**కాలంతో పనిలేదు...**

పాదాలను ఎండాకాలంలోనే సంరక్షించుకోవాలనే రూలేంలేదు. అన్ని కాలాల్లోనూ శ్రద్ధతీసుకున్నప్పుడే అవి అందంగా తయారవుతాయి. అందుకోసం ఇంట్లోనే తయారుచేసుకునే పదార్థాలతోపాటు, కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. వారానికి ఒక అరగంట సమయం మీ పాదాలకోసం కేటాయిస్తే్తచాలు అందమె%నా పాదాలు మీసొంతం. రోజుకు కొన్ని నిమిషాలు మీ పాదాలపై మీ దృష్టి సారించాలి.

**స్మూత్‌గా తయారవుతుంది...**

ఒక ప్లాస్టిక్ బౌల్‌లో గోరువెచ్చని నీటిలో సాఫ్ట్‌నెస్ కోసం కొన్ని చుక్కల 'చామోమైల్' వేయాలి. తరువాత పాదాలను అందులో పదినిమిషాల పాటు అందులో ఉంచాలి. తరువాత తీసి టవల్‌తో తుడిచేస్తేచాలు మీ పాదాలు ఎంతో నునుపుగా తయారవుతాయి. ప్యూమిక్ స్టోన్‌ను నీటిలో ఒక నిమిషం పాటు ఉంచి ఆ రాయితో పాదాల చర్మాన్ని సున్నితంగా రుద్దాలి. అప్పుడు చర్మంపై ఉండే మృతకణాలు చనిపోయి సాఫ్ట్ అండ్ స్మూత్‌గా తయారవుతాయి. మాయిశ్చరె%జింగ్‌క్రీమ్‌గానీ, ఆయిల్‌తో గానీ మీ పాదాలన మర్థనా చేసుకుంటే మీ పాదాలకు విశ్రాంతి కలుగుతుంది. అంతేకాకుండా తిరిగి ఉత్తేజంగా తయారవుతుంది.

**అపుడే అందం వస్తుంది...**

మీరు కాలిగోళ్లకు పాలిష్ వేయాలను కున్నప్పుడు ముందుగా గోరును శుభ్రపరుచుకోవాలి. ఇందుకోసం నెయిల్‌పాలిష్ రియూవర్‌ను ఉపయోగించవచ్చు. రిమూవర్‌ను ఉపయోగించిన తరువాత టవల్‌తో పూర్తిగా శుభ్రపరిచిన తరువాతే పాలిష్ వేసుకోవాలి. అప్పుడే అందం వస్తుంది. పాలిష్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ చర్మానికి తాకకుండా చూసుకోవాలి.

లేదంటే ఎంతో కష్టపడి వేసుకున్నా అందంగా కనిపించదు. ఈ విషయ గుర్తించుకోవాలి. ఎందుకంటే చాలా మంది నెయిల్ పాలిష్ వేసుకుంటే చుట్టుపక్కల చర్మానికి కూడా పెయింట్ అయివుంటుంది. నెయిల్ పాలిష్‌ను రిమూవ్ చేసేటప్పుడు కూడా జాగ్రత్తగా చేయాలి. ఇలా వారానికి ఒక సారి మీపాదాలపై శ్రద్ధుఉంచితే అందమైన పాదాలు మీ సొంతం అవుతుంది.




# ఇలా చేస్తే.. సంతోషం మీవెంటే..

సంతోషం, కోపం, బాధ, ఆందోళన వంటి అనేక భావనలు మనలో సహజంగా కలుగుతాయి. వీటన్నింటికీ మన మెదడులోని రసాయనాలే కారణం. ఈ విషయం శాస్త్రీయంగా నిరూపణ అయిన అంశం. మెదడులో విడుదలయ్యే నాడీ రసాయనాల వల్లే సంతోషం కలుగుతుంది కాబట్టి ఈ రసాయనాలను అదుపులో పెట్టుకుంటే ఎక్కువ ఆనందంగా ఉండొచ్చనేది శాస్త్రవేత్తల మాట. మన చుట్టూ ఉండే పరిస్థితులు, జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులు వంటివి ఒత్తిడికి గురిచేస్తాయి. ఫలితంగా ఆనందం దూరమవుతుంది. మరి ఇలాంటి సందర్భాల్లో మెదడులో హ్యాప్పీ కెమికల్స్ విడుదలయ్యేలా చూసుకుంటే మళ్లీ సంతోషాన్ని తిరిగి పొందవచ్చు. ఆనందాన్నిచ్చే రసాయనాలు విడుదలయ్యేందుకు ఏం చేయాలో.. దీనివల్ల సంతోషాన్ని ఎలా పొందాలో తెలుసుకుందాం..

**చల్లని నీటితో..** ఇది రోజా క్రమం తప్పకుండా చేసేపనే. చల్లని నీరు తీసుకుని కాస్త ముఖంపై చల్లుకోండి. దీనివల్ల గుండె వేగం తగ్గి, వేగస్ అనే ఓ కీలకమైన నాడీ సంబంధిత నరం ఉత్తేజితమవుతుంది. ఫలితంగా గుండె పనితీరు మెరుగుపడుతుంది. కండరాలు ఎక్కువగా ఆక్సిజన్‌ను వినియోగించు కుంటాయి. వేగస్ ఉత్తేజితమైతే జీర్ణవ్యవస్థ కూడా బాగా పనిచేస్తుంది. మన మూడ్‌ని, ఆలోచనల్ని మార్చేందుకు పరోక్షంగా ఈ ప్రక్రియ తోడ్పడుతుంది.

**సన్నిహితులతో మమేకం..**మూడ్ బాగోలేనప్పుడు ఒంటరిగా, ఒకే ప్లేస్‌లో ఉండడం మంచిది కాదు. వీలైనంత వరకు మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో గడిపేందుకు ప్రయత్నించండి. లేదా ఏదైనా బుక్‌స్టోర్, కాఫీ షాప్, షాపింగ్ కాంప్లెక్స్ వంటి పబ్లిక్ ప్లేసెస్‌కు వెళ్లండి. అక్కడి వారితో సంభాషించండి. ఇలా ఇతరులతో సరదాగా మాట్లాడడం, ఎంజాయ్ చేయడం వల్ల ఆక్సీటోసిన్ విడుదలవుతుంది. దీంతోపాటు సెరటోనిన్ కూడా మెరుగుపడుతుంది. ఈ రెండు రసాయనాలు ఉత్సాహాన్ని కలిగించేవే. అందువల్ల ఇతరులతో సన్నిహితంగా మెదలడం వల్ల మెదడుకు ఈ రసాయనాల వల్ల కొత్త శక్తి లభిస్తుంది. కేవలం తోటివారితో మాట్లాడడం మాత్రమే కాదు. గార్డెనింగ్, డ్రాయింగ్, మ్యూజిక్ వినడం వంటి పనులు కూడా చురుకుదనాన్ని కలిగిస్తాయి.

**చిరునవ్వు..** సంతోషంగా ఉన్నప్పుడే నవ్వగలుగుతాం అనేది సత్యమే. కానీ నవ్వడం వల్ల కూడా సంతోషం కలుగుతుందనే విషయాన్ని గుర్తించాలి. వీలైనంత వరకు నవ్వుతూ ఉండడానికి ప్రయత్నించండి. చిరునవ్వు అయినా, బిగ్గరగా నవ్వినా సంతోషం కలుగుతుంది. కృత్రిమంగా నవ్వినా, సహజంగా నవ్వినా మెదడులో కలిగే స్పందనలు దాదాపు ఒకేలా ఉంటాయి. అందువల్ల ఒత్తిడి ఎక్కువైనప్పుడు, ఆనందాన్ని కోరుకున్నప్పుడు నవ్వడానికి ప్రయత్నించండి. దీనివల్ల మెదడులో సంతోషాన్ని కలిగించే రసాయనాలు విడుదలవుతాయి. దీంతో మీరు ఆనందంగా ఉండగలుగుతారు.

**సూర్యకాంతితో చురుకుదనం..**

వీలున్నంత వరకు సూర్యోదయం, సూర్యాస్తమయం సమయంలో ఆరుబయట తిరగండి. లేదా ఆఫీస్ వేళల్లో కాస్త సూర్యకాంతి పడేలా చూసుకోండి. అలాగని ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగకూడదు. సూర్యకాంతి మెదడులో సెరటోనిన్ అనే రసాయనం విడుదలయ్యేలా ప్రేరేపిస్తుంది. ఇది మెదడుకు మంచి శక్తినిస్తూ, మనల్ని ఉత్సాహంగా ఉంచుతుంది. శరీరంలో మెలటోనిన్ విడుదలయ్యేలా కూడా సూర్యకాంతి తోడ్పడుతుంది. ఇది మంచి నిద్రను అందిస్తుంది.

# సమతుల సూత్రాలు



మహిళలు సమతుల ఆహారాన్ని వేళ ప్రకారం తీసుకుంటూ, శారీరక వ్యాయామానికి సరైన ప్రాధాన్యమిస్తూ ఉంటే అధికబరువు సమస్యే దరిచేరదు. అయితే, చాలామందికి ఆహారం తీసుకోవడంలో సరైన ప్రణాళిక ఉండదు. దాంతో అధిక బరువుతో పాటు అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నారన్నది పోషకాహార నిపుణుల అభిప్రాయం. ఆహార ప్రణాళికకు నిపుణులు అందిస్తున్న 5 సూత్రాలు..

భావోద్వేగాల ప్రభావం ఆరోగ్యం మీద చూపుతుంది. ఇలాంటి సమయాల్లో ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం, లేదా అసలు తీసుకోకపోవడం జరుగుతుంటుంది. మానసిక ఒత్తిడి అదుపులో లేకపోతే ఆహారం మీద అదుపు ఉండదు. అనారోగ్యకరమైన ఆహారం మరింత మానసిక ఒత్తిడికి దారి తీస్తుంది. ఇదొక విషవలయంగా మనిషిని వేధిస్తూనే ఉంటుంది.

మనిషి తన అవసరాలకు అనుగుణంగా ఆహారం తీసుకోవాలి. ఆ ఆహారపదార్థాలు సరియైనపాళ్ళలో వుండాలి. అవి ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన శక్తినీ, అమినో ఆమ్లాలనీ, విటమిన్లనీ, లవణాలనీ, కొవ్వునీ, పిండి పదార్థాలనీ ఇవ్వగలిగి వుండాలి. ఇటు వంటి ఆహారాన్ని సమతుల్య ఆహారం అంటాం. ఆహారపదార్థాలు సరియైన పాళ్ళలో లేక పోతే... అంటే- కొన్ని పదార్థాలు ఎక్కువైనా, తక్కువైనా అందులోని సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది. అయితే మనం రోజూ తినే ఆహారాన్నే కొద్దిగా మార్పులు, చేర్పులతో సమతుల్యంగా మలచుకోవచ్చు. సమ తుల్య ఆహారం కన్నా ఆరోగ్యకరమైనదీ, పుష్టికరమైనదీ సాధారణ శ్రమ చేస్తూ జీవనం సాగించే వారికి ఈ విధమైన ఆహారం సమతుల్యంగా ఉండవచ్చు.ఇందుకోసం నిపుణులు అందిస్తున్న పంచ సూత్రాలను చూద్దామా...

**1.ఆహార ప్రణాళిక:**

డైట్ ప్లాన్ సరిగ్గా ఉండాలి కదా అని ఒకే తరహా ఆహారంతో సరిపెట్టేయకూడదు. దీని వల్ల ఆ ప్రణాళిక సవ్యంగా నడవదు. కొన్ని రకాల పదార్థాలు మరికొన్నింటితో కలిపితే రుచిగానే కాదు, ఆరోగ్యానికీ మేలు కలుగుతుంది. అయితే, ఏ పదార్థాలు కలిపితే శరీరానికి మంచిది అనేవి తెలిసుండటం ముఖ్యం. ఉదాహరణకి- చేపలు ఆహారం తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని చాలామందికి తెలుసు. అయితే, చేపలను కూరల రూపకంగానే కాకుండా ఆవిరి మీద ఉడికించి, గ్రిల్ చేసి, ఇతర కూరగాయల సలాడ్స్‌తో తీసుకోవచ్చు.

**2.ఎంపిక ప్రధానం:**

లక్ష్యం వైపుగానే ఆహారపు అలవాట్లు ఉండాలి. మనకు నచ్చనిదె%నా ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాన్ని కూడా మెల్ల మెల్లగా మొదలుపెట్టి శరీరానికి అలవాటు చేయవచ్చు. దీని వల్ల లక్ష్యానికి త్వరగా చేరువకావచ్చు.

**3.భాగస్వామి ఎంపిక:**

కుటుంబంలోనో, స్నేహితుల్లోనో, సహోద్యోగుల్లోనూ.. మీలాగే ఆహారనియమాలు పాటించే వ్యక్తిని ఈ నియమాల్లో భాగస్వామిగా ఎంచుకోండి. దీని వల్ల ఆహార నియమాలను పాటించడంలో ప్రోత్సాహం ఉంటుంది. వాయిదా వేసే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. వాయిదా వేసినా తిరిగి కొనసాగించే ధోరణి ఈ పద్ధతిలో ఎక్కువ.

**4.కితాబు ఇచ్చేసుకోకండి:**

మీకు మీరుగా నేను చాలా బాగా ఆహార నియమాలు పాటించగలనుఅనే కితాబు ముందే ఇచ్చుకోకండి. ఎప్పుడె%నా నియమాలకు విరుద్ధంగా ఉన్నప్పు డు మిమ్మల్ని మీరు తిట్టుకునే అవకాశం ఉంటుంది. ఈ విధానం వల్ల మీ ప్రణాళిక కూడా పూర్తిగా మూలన పడే అవకాశమూ ఉంది. అందుకే, ప్రతి రోజూ ఈరోజును కొత్తగా, ఇంకా మరింత ఆరోగ్యకరమైన ఆహార నియమాలతో ప్రారంభిస్తాను అనుకోండి.

**5.ఒత్తిడిని అదుపులో ఉంచండి:**

భావోద్వేగాల ప్రభావం ఆరోగ్యం మీద చూపుతుంది. ఇలాంటి సమయాల్లో ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం, లేదా అసలు తీసుకోకపోవడం జరుగుతుంటుంది. మానసిక ఒత్తిడి అదుపులో లేకపోతే ఆహారం మీద అదుపు ఉండదు. అనారోగ్యకరమె%న ఆహారం మరింత మానసిక ఒత్తిడికి దారి తీస్తుంది. ఇదొక విషవలయంగా మనిషిని వేధిస్తూనే ఉంటుంది. అందుకని మానసిక ఒత్తిడిని అదుపులో ఉంచుకొని, నియమాల అమలు సక్రమంగా జరిగేలా చూడాలి.

**సమతుల్య ఆహారం:**

1. బియ్యం - 520 గ్రా, 2. పప్పుధాన్యాలు - 50గ్రా 3. ఆకుకూరలు - 40గ్రా, 4. కూరగాయలు - 70 గ్రా, 5. దుంపలు - 60 గ్రా, 6.పాలు - 200 గ్రా, 7. నూనెలు - 45 మి.లీ, 8. చక్కెర, బెల్లం - 35 గ్రా. అయితే -న్యూట్రీషన్ మన ఆరోగ్యానికి సరిపోయే సమగ్ర ఆహారం సూచిస్తారు.

పప్పు ధాన్యాలకు బదులుగా రెండుకోడి గ్రుడ్లు లేదా 50 గ్రాముల మాంసం, చేప సమానపోషక విలువలు కలిగి వుంటాయి. కొద్దిగా మార్పులతో ఈ రకమైన పాళ్ళఆహారం తీసుకుంటే అది సమతుల్య ఆహారానికి దగ్గరగా వుంటుంది. సమతుల్య ఆహారంలోకి వివిధ అంశాల పోషక విలువలు తెలుసుకోవలసిన అవసరం చాలా వుంది.

**ఆకుకూరలు - కూరగాయలు:**

సమతుల్యఆహారంలో ఇవి అత్యంత విలువైన భాగాలు. పచ్చ టి తాజా ఆకుకూరల్లో, కూరగాయల్లో బి, సి, కె. విటమిన్లు, ఇను ము, కాల్షియం తదితరాలు పుష్కలంగా వుంటాయి. వీటి లో ప్రోటీన్లు, పిండి పదార్థాలూ, కొవ్వులు ఉండవు. అ యితే ఆకుకూరల్లో వుండే పీచుపదార్థం ఆరోగ్య పరిరక్షణలో ముఖ్యమైన పాత్ర వహిస్తుంది. అవసరానికి మించి లావుగా వున్నవాళ్లు తమ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయల్ని ఎక్కువచేయడం ద్వారా ఆహారాని క్రమబద్ధం చేసుకోవచ్చు.

# ఈ లక్షణాలు మీకుంటే మీరు మేధావే..!

మేధావి అనే మాట వినగానే ముఖం అలా వెలిగిపోతుంది. ఓ మేధావి గురించి మాట్లాడినా, చెప్పినా, లేదా అతడిని చూసినా ఓ రకమైన సంతోషం కలుగుతుంది. ఇంతకీ మేధావి అంటే ఎవరు? అసలు అతడికి ఎలాంటి లక్షణాలు ఉంటాయి? మేధావి గురించే మాట్లాడుకునే వారిలో మేధావి లక్షణాలు లేవా.. మేధావి కావాలంటే ఎలాంటి లక్షణాలు ఉండాలి అనే అంశంపై బ్రిటన్‌కు చెందిన ఓ అధ్యయనం కొన్ని వివరాలు వెల్లడించింది. ముఖ్యంగా ఈ ఐదు లక్షణాలు ఉంటే మాత్రం మేధావేనట. ఆ లక్షణాలేమిటో ఒకసారి పరిశీలిస్తే..



**1. ప్రతి విషయం గురించి అమితమైన ఆసక్తి**

ఒకే అంశానికి పరిమితం కాకుండా నిరంతరం భిన్న విషయాలను పఠించి వాటిని నేర్చుకోవడం మేధావి లక్షణం. జీనియస్‌లంతా ఇలాగే చేస్తారట.

**2.మీలో మీరు మాట్లాడుకోవడం**

సాధారణంగా కొంతమంది వ్యక్తులు తమలో తాము మాట్లాడుకుంటుంటారు. అప్పుడప్పుడు ఆ మాటలు బయటకు కూడా వినిపిస్తాయి. వారిని చూసి కొంతమంది నవ్వుకుంటారు కూడా. అయితే, అలా మాట్లాడుకునేవారు అస్సలు సిగ్గుపడొద్దట. ఎందుకంటే మేధావులు అలాగే చేస్తారని అధ్యయనం చెబుతోంది.

**3.పుస్తకాల పురుగు**

సాధారణంగా ఎవరైతే నిత్యం పుస్తకాల్లో మునిగి ఉంటారో వారంతా జీనియస్ అంట. వారు పిచ్చిపట్టిన వారిలా పుస్తకాలు చదువుతూ కనిపిస్తారట.

**4.కష్టాలతో ఎంజాయ్**

మేధావులు కష్టాలను సవాలుగా తీసుకుని, వాటిని సొంత తెలివితేటలతో పరిష్కరించుకొని ఆనందంగా గడిపేస్తారంట.

**5.తప్పులు క్షమించి మర్చిపోగలిగే తీరు**

సాధారణంగా మేధావులు తప్పు చేసిన వారిని క్షమిస్తారట. అసలు ఆ విషయాలను అంతపెద్దగా పట్టించుకోరంట. ఒక వేళ ఎవరైనా ఆ తప్పులను గుర్తు చేస్తే ఎప్పుడు? అవునా అంటూ జీనియస్‌లు ప్రతిస్పందిస్తారంట.

# ఆయుర్వేద వైద్యం ఉత్తమం

పిల్లలు సాధారణంగా తినడానికి మరాం చేస్తుంటారు. అలాంటి వారు ఇష్టంగా తినే విధంగా మరమరాలు(బొనుగులు), పేలాలను చిన్నగా దంచి ఆ మిశ్రమాన్ని ఉడికించి పిల్లలకు తినిపించాలి. రుచి కోసం నెయ్యి కూడా కలుపుకోవచ్చు. జొన్న అంబలి, జావా కూడా పిల్లలకు పట్టించాలి. రాగులతో చేసిన అంబలి కూడా వడదెబ్బ తగలకుండా పిల్లలను రక్షిస్తుంది. రాగులు పోషకాల్లో మిన్న అంటారు. సెరాలాక్ లాంటి వాటికన్నా సహజ సిద్ధంగా ఇంట్లో తయారు చేసిన రాగులతో మాల్టోవా, జావా తాగిస్తే ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. చర్మం మృదువుగా కోమలంగా తయారవుతుంది. జుత్తు కూడా నిగనిగలాడుతుంది. కళ్లు తేజోవంతంగా నిగనిగలాడుతూ కనిపిస్తాయి.

**పళ్ల రసాలతో ఎంతో మేలు**

వేసవి తీవ్రత అంతకంతకూ పెరుగుతుండడంతో శరీరంలో నిస్సత్తువ ఆవహిస్తుంది. తాజా పళ్ల రసాలను తీసుకుంటే తక్షణ శక్తి లభించడమే కాకుండ పుష్కలమైన పోషకాలు లభిస్తాయి. ఎండ తీవ్రత వల్ల శరీరం డ్రైగా మారడాన్ని రసాలతో ఉపశమనం లభిస్తుంది. పాలు, నెయ్యి, చక్కెర మిశ్రమాన్ని రోజుకో చంచా చొప్పున తీసుకుంటే శరీరం అలసటకు గురి కాదు. తులసి ఆకులు, తేనే, అల్లం వామ పరగడుపున తీసుకుంటే వేసవిలో వచ్చే అన్ని వ్యాధులకు దూరంగా ఉండవచ్చు.

**అల్లం తేనేతో అజీర్తికి చెక్**

పరగడుపున అల్లం తేనే కలిపి తీసుకుంటే ఆరోగ్యానికి ఎలాంటి ఢోకా ఉండదు. వీలైతే జీలకర్ర, కొంచెం బెల్లం కలిపిన మిశ్రమాన్ని పరగడుపున తీసుకోవడం ద్వారా కడుపు శుభ్రం అవుతుంది. వడదెబ్బ తగలకుండా కూడా ఇది ఎంతో ఉపకరిస్తుంది. బెల్లం తీసుకోవడానికి ఇష్టపడని వారు ఓరల్‌డీహైడ్రేషన్ పౌడర్ కలుపుకొని నీటిని తీసుకుంటే మంచిది. ఓరల్ డీహైడ్రేషన్ పౌడర్ లేని పక్షంలో చక్కెర, చిటికెడు ఉప్పు మిశ్రమాన్ని కలిపి తీసుకుంటే చమటలు రాకుండా జాగ్రత్త పడవచ్చు.

**కొబ్బరి నూనేతో తైలమర్ధన**

తలకు కొబ్బరి నూనె రాసుకోరా అంటే ఈ కాలం పిల్లలు కొరకొరగా చూస్తారు. కానీ..పెద్దలకే కాదు పిల్లలకు కూడా కొబ్బరి నూనే వాడడం ఎంతో ఉపయుక్తం. తలకు, చేతులకు చక్కగా మర్ధన చేసుకోవాలి. చెవుల్లోనూ, ముక్కు లోపలి భాగంలోనూ కొబ్బరి నూనెను రాసుకోవాలి. చెవుల్లో నూనె పోసుకోవడం వల్ల కర్ణభేరి చల్లబడుతుంది. దీంతో మెదడు కూడా చల్లగా ఉంటుంది. కొబ్బరి నూనె కన్నా ఆముదం నూనే ఇంకా మంచిది.



జుత్తు ఒత్తుగా పెరగడమే కాకుండా చర్మం పొడిబారకుండా చూసుకుంటుంది.

సూపు..సూపర్!

చికన్, మటన్‌ల కంటే సూపులు చాలా బెటర్. చిన్న పిల్లలకు చక్కగా జీర్ణం అవుతుంది కూడా. ఎండలు అతిగా ఉంటే వేడితో వడదెబ్బ తగిలే ప్రమాదం ఎక్కువగా ఉంది. అందుకే చెవుల్లో కాటన్ దూది పెట్టుకుంటే.. వేడి నుండి కొంత ఉపశమనం లభించినట్లు అవుతుంది.

అతి వ్యాయామం అనర్థదాయకంసిక్స్ ప్యాక్ బాడీ కోరుకునే కుర్రాళ్లు జిమ్ముల చుట్టూ చక్కర్లు కొట్టడం పరిపాటి. అయితే ఇది ఎండాకాలం అన్న విషయాన్ని వారు ఒక సారి గమనంలో ఉంచుకోవాలి. వేసవిలో అతిగా వ్యాయామం చేయడం అంత మంచిది కాదు. జిమ్ములో ఎక్సెర్‌సైజులకు బదులు స్విమ్మింగ్ చేయడం చాలా ఉత్తమం. కొంత మంది చల్లని బీర్ లాంటి ఆల్కహాల్, మత్తు పదార్థాలు తీసుకుంటుంటారు. వేసవిలో అసలు తీసుకోకూడదని గమనించాలి.

కండరాల బిగుతుకు తైల మర్ధన

మసాజ్.. స్పా.. ఈకాలం పిల్లల టేస్ట్‌లు ఇవి. ఇవేం అలవాట్లు అని చీదరించుకునే తల్లిదండ్రులు ఉన్నారు మన సమాజంలో . అయితే కండరాల బిగుతుకు తైల మర్ధన తప్పని సరి. ఇది ప్రాచీన ఆయుర్వేదంలోనూ ఉంది. కాలంతో పాటు మనుషులు మారారు.. మనుషుల అభిరుచులూ మారాయి. ఇదే ఈకాలపు ఆధునిక ట్రెండ్ మసాజ్! తైలమర్ధన ద్వారా ఇమ్యూనిటీ పెరుగుతుంది. చర్మం డ్రైనెస్ తగ్గించడానికి వారానికి రెండు దఫాలు తైలమర్ధన ఎంతో ఉపయుక్తం.

**శనగపిండి నలుగుతో కాంతివంతమైన శరీరం**

శనగ పిండితో శరీరానికి నలుగు పెట్టుకుంటే శరీరం కాంతివంతంగా మెరుస్తుంది.

పసుపు, శనగపిండితో పిల్లలకు చక్కగా స్నానం చేయించి సాంబ్రాణి వేస్తే అలసలు పోతుంది. పిసి పిల్లలు హాయిగా నిద్ర పోతారు.

# ఏపీఎల్ శుభారంభం



మధురవాడ (విజయభాను న్యూస్) : పీఎం పాలెం ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో శ్రీరామ్ (ఆంధ్ర ప్రీమియర్ లీగ్) ఏపీఎల్ టి20 క్రికెట్ టోర్నమెంట్ ను బుధవారం అట్టహాసంగా ప్రారంభించారు, క్రికెట్ లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచే క్రీడాకారులను గుర్తించడమే ప్రధానాంశంగా ఈ టోర్నమెంట్ ను ప్రారంభించామని ఏసీఏ అధ్యక్షులు పి శరత్ చంద్రారెడ్డి అన్నారు. ముందుగా ఏపీఎల్ జెండాను ఆవిష్కరించి అనంతరం విన్నర్స్ మరియు రన్నరప్ ట్రోఫీ లను 6 జట్ల కెప్టెన్ల తో కలిసి అయన ఆవిష్కరించారు అదేవిధంగా టోర్నమెంట్లో కోస్టల్ రైడర్స్ మరియు గోదావరి టైటిల్స్ జట్ల మధ్య జరిగిన మొదటి మ్యాచ్ ను టాస్ వేసి అనంతరం బెల్ మ్రోగించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శరత్ చంద్రారెడ్డి మాట్లాడుతూ బీసీసీఐ అనుమతితో ఏసీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఏపిఎల్ టి20 క్రికెట్ మ్యాచ్ లో 6 జట్లు తలపడనున్నాయని 12 రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్లను నేరుగా వీక్షించేందుకు ప్రేక్షకులకు ఉచిత ప్రవేశం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఆంధ్ర లోని ప్రతి జిల్లా లోని క్రికెట్ పై ఆసక్తి ఉన్న యువకులును వారి ప్రతిభని ప్రోత్సహించి వారిని జాతీయ జట్లకు ఆడె విధంగా తీర్చిదిద్దాటానికి ప్రయత్నిస్తున్నామని. తోలి ప్రయత్నంగా మూడు ఎళ్ళు నిర్ణయించుకున్నామని, ఈ మ్యాచ్ లను బిసిసిఏ పర్యవేక్షిస్తుందని వారు ప్రతిభ గల క్రిడాకారులను గుర్తిస్తారని తెలిపారు. క్రికెట్ లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచే ఆటగాళ్లను వెలికి తీయడమే ఈ టోర్నమెంట్ ముఖ్య ఉద్దేశమని అందుకు క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎల్ చైర్మన్ గవర్నింగ్ కౌన్సిల్ సత్యప్రసాద్, ట్రెజరర్ గోపీనాథ్ రెడ్డి, సీఈవో వెంకటేష్ శివారెడ్డి, ఏసిఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





### మొదటి రోజు మ్యాచ్ విశేషాలు...

కోస్టల్ రైడర్స్ - గోదావరి టైటాన్స్ జట్ల మధ్య జరిగిన టోర్నమెంట్లో మొదటి మ్యాచ్లో విజెడి పద్ధతిలో గోదావరి టైటాన్స్ 2 పరుగులతో విజయం సాధించింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నకోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లో గోదావరి టైటాన్స్ ను 115 పరుగులకు కట్టడి చేసింది అనంతరం బ్యాటింగ్ కు దిగిన కోస్టల్ రైడర్స్ 7 ఓవర్ల వద్ద రెండు వికెట్లు కోల్పోయి 32 పరుగులు వద్ద వర్షం కారణంగా విజెడి పద్ధతిలో 2 పరుగుల తేడాతో గోదావరి టైటాన్స్ విజయం సాధించినట్లు ప్రకటించారు.



డా.ఎ.మల్లిఖార్జున, జిల్లా కలెక్టరు మరియు జిల్లా ఎన్నికల అధికారి బుధవారం ఉదయం చిన గదిలిలో గల ఇ.వి.ఎం గోడౌన్స్ ను పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశముల ప్రకారము ప్రతి 3మాసములకు నిర్వహించు తనిఖీలో భాగంగా ఇ.వి.ఎం లు మరియు వి.వి పాట్ లు బద్రపరచు ఎన్నికల గోదామును పరిశీలించారు. వై.ఎస్.ఆర్ సి.పి ప్రతి నిధులు అప్పలరాజు, శ్రావణ్ కుమార్, టి.డి.పి.ప్రతినిధి వై.సురేష్, బి.ఎస్.పి ప్రతినిధి బి.వి.వి.రామన్, బి.జె.పి. ప్రతినిధి ఎమ్.అప్పారావు, రూరల్ తహసిల్దార్ పాల్ కిరణ్, ఎన్నికల సూపరింటెండెంట్ సుమబాల, సి.హెచ్. మురళీధర్ డిప్యూటి తహసిల్దార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## గిరి ప్రదర్శనలో ప్లాస్టిక్ నిషేధం

**- జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మీశ**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఈ నెల 12వ తేదీన జరిగే సింహాచలం అప్పన్న స్వామి గిరి ప్రదర్శనలో నిషేధిత ప్లాస్టిక్ ను అనుమతించబోమని జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి గిరి ప్రదర్శన సందర్భంగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగించరాదని అందుకు ప్రజలు, గిరి ప్రదర్శనకు వచ్చే భక్తులు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు భక్తుల కొరకు ఏర్పాటు చేసే ప్రసాద వితరణ, త్రాగునీరు, మజ్జిగ మొదలైనవి ప్లాస్టిక్ వస్తువులతో అందించరాదని, ప్లాస్టిక్ రహితమైన ఆకులు, కాగితపు, స్టీలు గ్లాసులు వినియో గించాలని సూచించారు. వివిధ సేవా సంస్థలు భక్తుల కొరకు ఏర్పాటు చేసే స్టాల్స్, వారి ప్రకటన బోర్డులు ప్లాస్టిక్ రహితమైనవి అయి ఉండాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం పారిశుద్ధ్యం నిర్వహణ, విద్యుత్ దీపాలు, త్రాగునీరు మొదలైన ఏర్పాట్లు జివిఎంసి చేస్తుందని కమిషనర్ తెలిపారు.

## సిక్కోలు బిడ్డకు గ్రూప్-1 కొలువు



పొందూరు : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో సిక్కోలు బిడ్డ మెరిసింది. తొలి ప్రయత్నంలోనే ప్రభుత్వ కొలువు సాధించింది. పొందూరు మండలం కింతలి గ్రామానికి చెందిన యతిరాజుల భవానీ మండల పరిషత్తు డెవలప్మెంట్ అధికారిగా(ఎంపీడీవో) ఎంపికయ్యారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన వరహాలరావు, లక్ష్మి దంపతుల కుమార్తె భవాని. ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షలు మొదటిసారి రాసి ఈ ఘనత సాధించారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు కింతలి ప్రభుత్వ పాఠశాల, ఇంటర్ శ్రీకాకుళం, రాజాంలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. 2016లో వివాహమైంది. ఈమె భర్త ప్రసాదరావు విశాఖలో ఆర్.ఎస్.ఐ.గా పనిచేస్తున్నారు. కుమార్తె ఉంది.

కుటుంబాన్ని చూసుకుంటూనే పరీక్షలకు సన్నద్ధమైనట్లు ఆమె పేర్కొన్నారు. భవానీకి అయిదుగురు సోదరులు, ఇద్దరు అక్కలు ఉన్నారు.

ఎంపీడీవోగా ఎంపిక కావడంపై గ్రామ సర్పంచి పైడి ప్రసాదరావు, ఎంపీటీసీ సభ్యుడు హనుమంతురావు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

## కోవిడ్, డెంగ్యూ, మలేరియా కేసులు పెరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

**- ప్రజలందరూ కోవిడ్ నిబంధనలు పాటించాలి : జిల్లా కలెక్టరు డా.ఎ.మల్లిఖార్జున**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జిల్లాలో కోవిడ్ కేసులు పెరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరం లో జిల్లాలో కోవిడ్, డెంగ్యూ, మలేరియా కేసులు సంఖ్య, వ్యాధి నిర్ధారణ, పరీక్షల నిర్వహణ, చికిత్స తదితర అంశాలపై వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా కోవిడ్ వ్యాధిపై సమీక్షిస్తూ జిల్లాలో నిన్న జరిపిన 550 పరీక్షలకు గాను 109 కేసులు 25 శాతం పాజిటివిటీ తో నమోదు కావడం జరిగినట్లు తెలియజేశారు. ఎటువంటి తీవ్ర లక్షణాలు లేని సాధారణ కేసులు నమోదు కావడం జరిగినట్లు తెలియజేశారు. ఎటువంటి మరణాలు నమోదు కాలేదన్నారు. కేసుల పెరుగుదల దృష్ట్యా కోవిడ్ జన్యు శ్రేణి వివరాల సేకరణ పరిధి పెంచాలన్నారు. జిల్లాలో ఉన్న అన్ని గ్రామ, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా, జిల్లా ఆసుపత్రులలో అన్ని అనుమానిత కేసులను వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశించారు.. జిల్లాలో సరిపడా అన్నిరకాల కోవిడ్ మందులు, టెస్టింగ్ కిట్స్, హెూమ్ ఐసోలేషన్ కిట్స్, ఆక్సీజెన్ సిలిండర్లు, కాన్సన్ట్రేటర్స్ ఉన్నాయని అన్నారు. కేజీహెచ్ లో 100 బెడ్స్ సిద్ధం చేయాలని కె.జి.హెచ్. సూపరింటెండెంట్ కు సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసిన అన్ని ఆక్సిజన్ ప్లాంట్స్ నిర్వహణ పరిశీలనల గావించాలని, కచ్చితంగా పని చేసే స్థాయిలో ఉండాలని ఆదేశించారు.కోవిడ్ విషయంలోల వైధ్యాధికారులు, ల్యాబ్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి తగు రీతిలో స్పందించాలన్నారు. కోవిడ్ కి సంబంధించిన సహాయం, సమాచారం కోసం 104 నంబర్ కు కాల్ చేసి వివరాలు పొందవచ్చని తెలియజేశారు. ప్రజలందరూ మాస్క్ ధరించాలని, భౌతిక దూరం పాటించాలని, సానిటైజర్ వినియోగించాలని కోరారు . అదేవిధంగా డెంగ్యూ , మలేరియా కేసులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, తీసుకుంటున్న చర్యలపై చర్చించి, యాక్షన్ ప్లాన్ తయారు చేసి చూపాలని జిల్లా మలేరియా అధికారిణిని ఆదేశించారు. కె.జి.హెచ్ లో డెంగ్యూ ట్రీట్మెంట్ కు సదుపాయాలు, ప్లేట్లెట్స్ సపరేటర్స్ వివరాలు తెలుసుకున్నారు. మంగళవారం, శుక్రవారం డ్రైడేను తప్పని సరిగా పాటించాలని జి.వి.ఎం.సి వైద్యాధికారికి సూచించారు. జిల్లాలో డెంగ్యూ వ్యాధికి చికిత్స అందించు ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి ని ఆదేశించారు. ముఖ్యమంత్రి గారు డెంగ్యూ వ్యాధిని ఆరోగ్యశ్రీ లో చేర్చినందున అందరూ యాజమాన్యాలు తప్పనిసరిగా ఉచితంగా చేయాలని ఆదేశించారు. అదేవిధంగా డెంగ్యూ వ్యాధికి నగదు రూపంలో చేసే ప్రతి బిల్ వివరాలు జిల్లా వైద్యాధికారికి తప్పక సమర్పించాలని ఆదేశించారు. గత సంవత్సరం అధికంగా కేసులు నమోదు కాబడిన ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి సారించాలని జీవీఎం సీ అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారిణి డా. విజయలక్ష్మి, ఆంధ్రామెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.జీ. బుచ్చిరాజు, కె.జి.హెచ్. సూపరింటెండెంట్ .డా.మైథిలి, విమ్స్ డైరక్టర్ డా. కె.రాంబాబు, మైక్రో బయాలజి విభాగాధిపతి కమల, జిల్లా మలేరియా అధికారిణి, డి.సి.హెచ్.ఎస్, ఇ.ఇ., ఎ.పి.ఎస్.ఎం.ఐ.డి.సి నాయుడు, పలువురు వైధ్యాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రులు సింధియా, స్మృతి ఇరానీకి అదనపు బాధ్యతలు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీకి అదనంగా మైనార్టీ సంక్షేమ శాఖను అప్పగించారు. ఈ క్రమంలోనే జ్యోతిరాధిత్య సింధియాకు ఉక్కు, గనుల శాఖను కేటాయించారు.

అయితే, కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి.. ముక్తార్ అబ్బాస్ నఖ్వీ తన పదవికి బుధవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. రాజ్యసభ ఎంపీగా గురువారం ఆయన పదవీ కాలం ముగుస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

నఖ్వీతో పాటుగా రామ్ చంద్ర ప్రసాద్ సింగ్ కూడా రాజీనామా చేశారు. దీంతో ప్రధాని నరేంద్ర మోదీ సలహా మేరకు.. కేబినెట్ మంత్రి స్మృతి ఇరానీకి ప్రస్తుతం ఉన్న పోర్ట్ఫోలియోతో పాటు మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖను కూడా కేటాయించాలని రాష్ట్రపతి ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com